# మారుపేర్లు

## కొడవటిగంటి కుటుంబరావు

సుబ్రహ్మణ్యాని కారోజు అనలే దుర్దినం. జీవితాన్ని సుగమం చేసుకోటానికి అందరూ తలొక ఉపాయమూ ఆలోచిస్తారు. ప్రపంచంలో మంచివాళ్ళూ, చెడ్డవాళ్ళూ అని రెండు జాతులే ఉన్నట్టు నటిస్తారు కొందరు; దోచుకునేవాళ్ళూ దోపిడి అయేవాళ్లూ మాత్రమే ఉన్నట్టు భావిస్తారు మరికొందరు; అంతా మన యత్నమే అని బయల్దేరతారు కొందరు; అంతా ఈశ్వర చిద్విలాసమని కాలు కదపరు మరికొందరు.

సుబ్రహ్మణ్యం తన జీవితాన్ని చెడ్డరోజులుగానూ, మంచి రోజులుగానూ, విభజించుకుని సంతృప్తిపడేవాడు. అతని జీవితంలో యథార్థానికి చెడ్డరోజులపాలే అధికమైనప్పటికీ, "ఈ రోజు చెడ్డరోజూ!" అని తేల్చేసుకున్న తరవాత, ఆ రోజున అతను తలపెట్టే వందపనులకు వంద అవాంతరాలొచ్చినా అదో తృప్తిగా ఉండే దతనికి.

సామాన్యంగా ఇటువంటి మనస్తత్వం ఉండేవాళ్ళు విధిలో పూర్తి విశ్వాసం గలవాళ్లయి ఉంటారు. వాళ్ళు నక్షత్రఫలితాలను చూసుకొని వాటిని నిజం చెయ్యటానికి అనవసర ప్రయాణాలకూ, ఇష్టంలేని జూదాలకూ ఉపక్రమిస్తారు సుబ్రహ్మణ్యం పూర్తిగా ఆ జాతికి చెందినవాడు కాడు. అతనికి మనుష్య ప్రయత్నంలోనూ, మార్క్సు సిద్ధాంతాల్లోనూ కొంత నమ్మకండుంది. కాని అతనికి ఐదేళ్ళుగా ప్రయత్నంచేసే అవకాశమన్నా దొరకటంలేదు. అందువల్లఅతని ఉత్సాహం పూర్తిగా విరిగి పోయింది. ఏ ప్రయత్నమూ చెయ్యనివాడికి ప్రపంచం విధి మహత్యంవల్లే నడుస్తున్నదని భ్రమ ఏమాత్రమో కలగటంలో వింతలేదు.

గొడ్డలిపట్టుకుని, చమటోడ్చి కట్టెలు కొట్టేవాడికి దైవికంగా పేళ్ళు పగుల్తున్నట్టు భావన రాదు. కాని దూరాన ఉండి పరధ్యానంగా చూసేవాడికి ఒకచెట్టు విరిగి పడటం చప్పున కంటబడితే దానిపాటుకు కారణం దేముడేమోనని ఇట్టే భ్రమ కలక్కపోదు.

బి. ఏ. పరీక్ష గడిచి డిగ్రీతీసుకున్న ఈ ఐదేళ్ళనించీ సుబ్రహ్మణ్యం సంపాదనకు ఎటువంటి ప్రయత్నమూ చెయ్యలేదు – చెయ్యలేక పోయినాడు. వాళ్ళ ఊళ్లో అతను చెయ్యగల ఉద్యోగాలాటే లేవు. ఉన్నవాటికైనా ఇప్పించేవాళ్లూ, శిఫార్సులూ లేకుండా దొరకవని అతని కెన్నడో తెలిసి పోయింది. కాని తన తప్పులేకుండా అతను అడ్డమైన నౌకరీకీ దరఖాస్తులు పారేస్తూ వచ్చాడు. అతన్ని డిగ్రీవచ్చిన కొత్తలో అభినందించి, పైకివస్తావని ఆశీర్వదించిన వాళ్లే ఇప్పుడతన్ని గురించి ఆలోచించటం కూడా మానేశారు. అయిదేళ్ళపాటు కానీ తెచ్చుకోలేకుండా ఇంటోకూచుని, తండ్రి ప్లీడరుగుమస్తాగిరీచేసి తెచ్చే మెతుకులు మేసేవాణ్ణి ఎవరుమాత్రం ఏమని అభినందిస్తారు, ఆశీర్వదిస్తారు? వాళ్ల నోటి వాక్కు అబద్ధం చేసినందుకే అతన్ని వాళ్ళు క్షమించరాదు, నిజానికి.

కాని, ఉద్యోగం తెచ్చుకోలేనందుకు అతన్ననిమాత్రం ఏంలాభం? ఈ ఉన్న పరిస్థితుల్లో సుబ్రహ్మణ్యమేగాదు, మరోరు మాత్రం చెయ్యగలిగిందేముంది? అది గుర్తించకుండా అతన్ని వాళ్లనాన్న ఆ ఉదయం అంతంత మాటలని ఉండటం అజ్ఞానం. కాని అనుకునిమటు కేంలాభం? తన తండ్రి గనక అంత అనాలోచనగా తన నన్నిమాట లన్నాడుగాని తను తండ్రిని ఏమీ అనదలుచుకోలేదు. ఇక తనకాయింట స్థానంలేదు. తను ఎక్కడికన్నా వెళ్ళిపోవలసిందే. తను వెళ్లిపోవటానికి తండ్రి అభ్యంతరం చెప్పలేదు. కాని పట్నం వెళ్లటానికి పదిరూపాయలియ్యమంటే తనదగ్గిర లేవన్నాడు, (ఒకవేళ నిజంగా లేవేమో కూడానూ; అయినా, ఉండి ఇవ్వటం ఇష్టంలేనట్టుగా మాట్లాడాడు) పైగా, పదిరూపాయలు పెట్టి అంతదూరం పోకపోతే ఏమన్నాడు. ఆయనకు చెబితే అర్థంకాదు, కాని పట్నంపోతే చాలా వీళ్ళున్నై. పట్నంలో డబ్బుకు డబ్బా ఎక్కువ. ఉద్యోగాలకుద్యోగాలూ విరివిగా ఉంటై. పట్నంలో కూలిపని చేసుకుంటే అడిగేవాడుండడు. "ఆ పని ఇక్కడే అఘోరించరాదూ?" అన్నాడు తన తండ్రి. కాని నిజంగా చేస్తే ఒప్పుకుంటాడా? ఖిల్లీకొట్టు పెట్టుకుంటానని తను అంటే ఆయన కెంత కోపం వచ్చింది? నిజానికి అటువంటిపని ఉన్నఊళ్లో చెయ్యటం తనకూ కష్టమే. ప్లీడరు వాలంటీరుగా చేరమని తనతండ్రి సలహాయిస్తే తనకెంత కోపం వచ్చింది?మనం

ఆర్థికంగా ఏవర్గానికి చెందామో ఆ వర్గం వదిలేసి దాని పైవర్గం తాలూకు సంస్కారం డబ్బిచ్చికొనుక్కుంటే ఆ ఫలితం అనుభవించక తప్పుతుందా? ఇంతకూ, ఈ పదిరూపాయలూ తన బంధువర్గంలో ఎక్కడా పుట్టలేదు. ఒక స్నేహితుడు అప్పిచ్చాడు పాపం-వాడిధర్మమా అని.

ఇవాళ నిజంగా ఎంత దుర్దినమో—ఈ డబ్బు దొరికేటప్పటికి రైలు టైమయింది. "ఇంకో అయిదు నిమిషాలాగు, కూర అవుతుంది, తిండి తినిపో" అంటుంది తల్లి. మొత్తానికి తిండి తిన్నాడు. ఆదరాబాదరా మెతుకులు నోట కొట్టుకోవటంలో భోంచేసినట్టే లేదు. (మళ్ళీ తన తల్లి చేతి భోజనం ఎప్పటికో!) అసలే ఆలస్యమయిందని బండి చేసుకుని వచ్చి స్టేషన్లో పడితే, అప్పటికే బండి వచ్చి స్టేషన్లోఉంది. ఈ లోగా బండివాడికివ్వటానికి చిల్లరలేదు, టిక్కెట్లు కొందామంటే బుకింగాఫీసులోవాడు "బండి కదలబోతున్నది. అంద" దంటాడు కాని టిక్కెట్టివ్వడే! ఎట్లాగో వాడి దగ్గర టిక్కెట్టు పుచ్చుకుని, వెంట ఉన్న బండివాడితో తర్కించేటందుకు టైములేక వాడడిగినంతా యిచ్చి ఉన్న ఒక్క బెడ్డింగూ పట్టుకుని ప్లాటుఫారం మీదికి వస్తుండగనే బండి కదిలి కూతేసింది. ఆ తరవాత స్టేషన్లో గంట కొట్టారు. రైలువెంట పరిగెత్తి ఒకసారి ఎక్కబోతే అది సెకండు క్లాసయింది. దాన్ని వొదిలి మళ్ళీ ఇంకో కంపార్టుమెంటు పట్టుకుని ఎక్కేటప్పటికి అది ఫస్టుక్లాసు!

## 2

సుబ్రహ్మణ్యం గుండెలు దడదడ లాడుతున్నై. ఫస్టుక్లాసులో ఎక్కినందుకాదు; ఇన్ని గండాలూ గడిచి తనకు రైలందినందుకు. బండి స్టేషనుదాటి దాదాపు అరమైలు వచ్చినా, సుబ్రహ్మణ్యం బుద్ధి జరిగిన విషయాల మీదినుంచి కదిలి, ప్రస్తుతాంశానికి రాకపోవటం వల్ల ఇంకా అతనిచేతిలో బెడ్డింగు చేతులోనే ఉంది. అత నింకా ఆ వాకిలిదగ్గిరే నిలబడి ఉన్నాడు.

"కూచో!"

ఈమాట చెవిన పడేవరకూ సుబ్రహ్మణ్యానికి ఆ కంపార్టుమెంటులో ఎవరున్నదీకూడా తెలియదు. ఆ రెండు అక్షరాల సహాయంతోనూ సుబ్రహ్మణ్యం మనస్సు గతాన్ని వదిలివేసి ప్రస్తుతాన్ని చేరుకుంది. ఆ పెట్టెలో ఒక్కడే ఉన్నాడు. తన ఈడువాడే. తన మాదిరిగానే కొంచెంసన్నగా, పొడుగ్గాఉన్నాడు. ఖరీదైన కళ్ళజోడు పెట్టుకున్నాడు. చాలా ఖరీదైన సూటూ బూటూ వేసు

కున్నాడు. చూపులకే ఐశ్వర్యంలో పుట్టి పెరిగినట్టున్నాడు. చేతిలో చచ్చురకం పుస్తకం—పనీ పాటా లేని ధనిక వర్గంవాళ్ళు, కాలాన్ని హతంచెయ్యటానికి, సిద్ధహస్తులైన మూడోతరగతి రచయితలచేత ప్రత్యేకించి రాయబడే జాతిది—ఒకటుంది.

ఈ వివరాలన్నీ గమనించగానే సుబ్రహ్మణ్యం రక్తం ఉడికిపోయింది. ఈ—ఈ వాజ తనని "కూచో!" అంటాడా? మర్యాదగా సంబోధించ లేడూ? తనే ఆ మాటంటే ఏమవుతాడు?

"నాదగ్గిరున్నది మూడోక్లాసు టిక్కెట్టు. మూడోక్లాసులోకి పోయికూచుంటా" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"రైలాగితే వెళ్లొచ్చు. అందాకా కూచోరాదూ" అన్నాడుకుర్రాడు.

"అలవాటు లేకపోవటాన పరుపులమీద కూచుంటే, వేసంకాలం బ్లేజరుకోటు వేసుకున్నట్టుంటుంది." అని సుబ్రహ్మణ్యం ఎత్తిపొడిచాడు.

రెండో అతను నవ్వి తన బ్లేజరుకోటుకేసి చూసుకుని మళ్లీ సుబ్రహ్మణ్యం వంక తిరిగి, "నీకు డబ్బున్నవాళ్ళంటే అటే ఆపేక్ష ఉన్నట్టులేదు" అన్నాడు.

"కప్పకు పామంటే ముద్దా? " అని అడిగాడు సుబ్రహ్మణ్యం.

"మన దేశంలో ధనికులు దరిద్రులను తింటున్నారా?"

"తప్పకుండా! మనిద్దరమే ఉన్నాం: నువెంతవరకు చదివావో నాకు తెలీదు. నేను బియ్యే పాసయినాను. నువు చదివే ఆ వెధవ పుస్తకం నేను డబ్బిచ్చినా చదవను. మనిద్దరమూ ఒకేరకం గుడ్డలు వేసుకుని ఉద్యోగానికి పోతే నా కెంత దొరుకుతుందో నీకూ అంతే దొరుకుతుంది. కాని నువు డబ్బు తగలేసి ఫస్టుక్లాసులో ప్రయాణం చేస్తున్నావు. నేను అవసరమైతే కూలిపని చెయ్యటానికి పట్నం వెళుతున్నాను. ఉద్యోగం లేదని మా నాన్న నన్నిల్లు వెళ్లగొట్టాడు. నేను రైలుఛార్జీ అప్పుచేశాను. పట్నం చేరిన ఇరవైనాలుగ్గంటల్లో నేను సంపాదన ప్రారంభించలేకపోతే మాడతాను. నీకీగతి ఎప్పుడన్నా పడుతుందని కల్లోనైనా అనుకోగలవా?"

"ప్రపంచంలో అంతా నా వంటి భాగ్యవంతులే అయితే తప్ప దీనికి ఉపాయం ఏముందీ ప్రపంచంలో అంతా నా వంటి ధనికు లున్నారనుకున్నా అప్పుడు మళ్లీ పని చేసేవాళ్ళెవరనే సమస్య రానే వస్తుందిగా? అందరూ బీదలేఉంటే అందరికీ ఉద్యోగ సమస్య ఉండటమే కాక. అది పరిష్కారం అయే మార్గం ఉండదే. నువు నిష్కారణంగా ధనికుల దగ్గిరుండే డబ్బుచూసి, అది నీకు లేక




పోయెనే అని అసూయపడుతున్నావు, బ్రదర్!" అన్నాడు సూటులో ఉన్న యువకుడు.

అసూయ అనేటప్పటికి సుబ్రహ్మణ్యానికి రోషం వచ్చింది.

"నీ డబ్బు చూసి నే నసూయ పడటంలేదు, నీ అంత డబ్బు నాకుండే అవతల పారేస్తాను. అదికాదు విషయం. నీ డబ్బు నీకిచ్చే హక్కులు చూసి నేను సహించలేకుండా ఉన్నాను. నేను నా పొట్ట పోషించుకోలేను. కాని నువు నీ డబ్బును రెట్టింపు చేసుకోగలవు లేదా, పనీ పాటా లేకుండా కూచుని వడ్డీ మీద బతుకుతూ నా బోటివాడిచేత చాకిరీ చేయించుకోగలవు. నైతికంగా సంఘంలో నీస్థితి ఏమిటి, భౌతికంగా నా గతేమిటి?"

"నీ వేదాంతంలో మాటలేగాని చేతలున్నట్టు లేదు. కానీ లేకుండా బయల్దేరి లక్షలు సంపాదించిన వాళ్లున్నారు. వాళ్ళెవ్వరూ ఈ వేదాంతం చెప్పలేదు. నువు గట్టి ప్రయత్నం చేస్తే కొద్దికాలంలోనే నిన్ను నువ్వు తిట్టుకోవలసినంత భాగ్యవంతుడివై పోతావని నేనంటాను. కాదని రుజువుచెయ్యగలవా?"

"వొట్టిది!"

"చూడు. నీ బియ్యే సర్టిఫికేటూ, నీ గుడ్డలూ నా కిచ్చెయ్యి. నెల్లాళ్లలో నేను మంచి నౌకరీ సంపాదించగలను నీకు చాతైతే నా బట్టలూ నా సామానూ తీసుకుని నా పేరు పెట్టుకుని నేను చెయ్యబోతున్న పని చెయ్యి. చూస్తాం!"

"ఏమిటది?"

"మాకు పట్టణంలో పెద్ద కమీషను వ్యాపారం ఉంది. మా గోడౌను ఇవాళ హీనంగా రెండు లక్షలు ఖరీదు చేస్తుంది. ఇటీవలనే నేను ఇంగ్లండులో ఉండగా మా నాన్నగారు పోయినారు. నే నా వ్యాపారం సొంతాన చేసుకోబోతున్నాను."

"పెట్టుబడి నాలుగు లక్షలకు పెంచుకోవటానికి?"

సూటు వేసుకున్న కుర్రాడు నవ్వి, "నా స్టాకంతా వేలం వేసి పొలం కొనుక్కుంటే దానిమీద యేంవస్తుందో అందులో సహం కంటె వ్యాపారంమీద కనిపించటంలేదు. నీకు ఉద్యోగం సంపాదించాలని ఎంత పట్టుదలగా ఉందో నాకు మా వ్యాపారంలో లోటు తెలుసుకుందామని అంత పట్టుదల ఉంది. ఎంత చచ్చు వ్యాపారమైనా వ్యవసాయానికి తీసిపోరాదు. అటువంటిది మా వ్యాపారం చాలా తీసింది. అది నా మానుషానికి చాలా దుర్భరంగా ఉంది. అటువంటి మానుషం అందరికీ ఉంటే సంఘం కొంత పైకి వస్తుందని నా కాశ ఉంది, చెప్పొద్దూ. ఆ మీదట ధనికులకూ, దరిద్రులకూ యేర్పడే సంఘర్షణ ఏమిటో చూడవచ్చు. నీ మానుషాన్ని నువు రుజువుచేసుకునేదాకా కబుర్లు చెప్పటానికి నీ కర్హత లేదంటాను" అన్నాడు.

సుబ్రహ్మణ్యం తల అడ్డంగా తిప్పి, "డబ్బున్నవాడి మానుషానికీ, లేనివాడి మానుషానికీ ఉన్న తేడా నువు గ్రహించలేదు. మానుషంకొద్దీ వెళ్లి నువ్వు నీ రెండు లక్షల వ్యాపారంమీద ఎక్కువ లాభాలు తియ్యగలవు నేను పొట్ట పోసుకోలేను" అన్నాడు.

"అది అబద్ధమని నేను రుజువుచేస్తాను...నీ పేరేమిటి?"

"సుబ్రహ్మణ్యం - బడుగు సుబ్రహ్మణ్యం. అసలా పేరు చూసి ఎవడు ఉద్యోగం ఇస్తాడు?"

"ఆ పేరుతో నే నుద్యోగం సంపాయిస్తాను. ఇదే షరతు. నువు వెళ్లి నా వ్యాపారం బాగుచెయ్యి. నీ బెడ్డింగు నా కిచ్చెయ్యి, నా సామాను నువు తీసుకో. నీ గుడ్డలు విప్పి నాకియ్యి నా పేరు నాగభూషణం - కడప నాగభూషణం. కె.ఎన్.భూషణ్ అని చెప్పుకుంటాను."

నాగభూషణం నిజంగానే కోటూ, లాగూ, బూటూ, టై మొదలైనవి విప్ప సాగాడు.

"వీడికేమైనా మతిపోయిందా ఏమిటి?" అనుకున్నాడు సుబ్రహ్మణ్యం. "ఇది వీడి బూర్జువా జబ్బేమో!" అనుకున్నాడు.

"ఇదుగో! ఉండు, ఉండు! ఆగు! నిజంగా ఈ పని చేతామనే ?" అన్నాడు సుబ్రహ్మణ్యం కంగారుపడుతూ.

భూషణ్ నవ్వి, "ఎందుకు వెనక్కు తీస్తున్నావు? నువు నిజంగా వొట్టి కబుర్లమనిషిల్లే వున్నావు" అన్నాడు.

సుబ్రహ్మణ్యం కంగారు అణుచుకుటూ, ''నన్ను నిమిషంలో పట్టుకుంటారు" అన్నాడు.

"కావాలని నువు దొరకాలి గాని నిన్నెవరూ పట్టుకోలేరు. నన్ను పట్టణంలో ఎవరూ ఎరగరు. అఖరుకు సుశీలకూడా నేను జ్ఞాపకం వుండను"

"సుశీలెవరు?''

''నేను పెళ్లి చేసుకోబొయ్యే అమ్మాయి పట్టణంలో బియ్యే చదువుతున్నది. చిన్నప్పుడు చాలా ఏళ్ళు కలిసే పెరిగాం. ఉత్తరాలు రాసుకుంటున్నాంగాని నన్ను సుశీల చూసి ఆరేడేళ్లయింది. నా మొహం ఆవిడకి గుర్తుండదు, అయినా నీకా మనిషితో ఏమీ సంబంధం వుండదు. ఈ ఏర్పాటు సరిగా నెలరోజులు పెట్టుకుందాం. ఆ తరవాత నువు నువే, నే న్నేనే! సమ్మతమేనా?"

"నాకిదంతా చాదస్తంగా ఉంది!" అని ప్రారభించాడు సుబ్రహ్మణ్యం.

''నిన్ను బలాత్కరించటం నా ఉద్దేశం కాదు. నేను జేబులో కానీ లేకుండా వెళ్లి పట్నంలో ఉద్యోగం సంపాదించి పొట్టపోసుకోగలనని రుజువు చెయ్యడం బొత్తిగా నీ కోసమే అనుకోకు. నాకూ అది చాలా మంచిదే. ఇది చాలా మంచి అవకాశం. నువు జంకితే మరి—''

"నేను జంకను నా కభ్యంతరంలేదు" అన్నాడు సుబ్రహ్మణ్యంబింకంగా.

## 3

మన కొక కొంత అనుభవం కలిగినప్పుడు, ఆ అనుభవాన్ని స్వీకరించ టానికి మనం మానసికంగా తయారై ఉండాలి. లేకపోతే దానికి విలువ ఉండదు. అకస్మాత్తుగా మన కోగంటపాటు దేముడు కనిపించి పోతే ఆ అనుభవంయొక్క సంపూర్ణమైన విలువ మన కెన్నటికీ దక్కదు. దానికి కారణమేమంటే, అటువంటి అనుభవం తాత్కాలికంగా మనవ్యక్తిత్వాన్ని ఆహరిస్తుంది. అనుభవం మనకుగాక మరెవరికో జరుగుతున్నట్లుంటుంది.

సుబ్రహ్మణ్యం పట్నంహోటల్లో కూచుని తన వ్యక్తిత్వాన్ని తిరిగి తెచ్చుకో టానికి ప్రయత్నిస్తున్నాడు. ఆ వ్యక్తిత్వం తన పాతపంచా, నేతలాల్చీ ధరి

స్తైనేగాని తిరిగివచ్చేట్టు కనిపించలేదు. 'నాకీసూట్లూ బూట్లూ అసహ్యం! వ్యాపారమంటే మంట! వెధవ వ్యాపారం! నాగభూషణం అనవసరంగా నాకీ పీడ తెచ్చిపెట్టాడు' అనుకున్నాడతను, తనుభయపడిపోయినట్టు అతనుతెలుసుకోలేదు.

అన్నిటికన్న అతన్ని మరీ వేధిస్తున్నది బాధ్యత ఇప్పుడు తను 'కడపా ఏజెన్సీస్' వెతుక్కుంటూ వెళ్ళాలి. వెళ్ళి మేనేజరుతో మాట్లాడాలి. ఏం మాట్లాడాలో! ఆ భూషణంగాడైతే ఏం మాట్లాడేవాడో! ఈ లోపల తన పేరు భూషణ్ అనేది మరిచిపోరాదు... ఒకవేళ అక్కడి గుమస్తాల్లో ఎవరన్నా సుబ్రహ్మణ్య మనేవాడుండి, వాణ్ణి ఎవరన్నా పిల్చినప్పుడు గనక తను ఏమరుపాటున పలికితే గుట్టు బయటపడుతుంది. తనని జైల్లో తోస్తారు. చివర కదే రాసిపెట్టి ఉంది తనకు!

ఈ ఆలోచన కల్గగానే సుబ్రహ్మణ్యం మరింత కుంగిపోవటానికి బదులు అతని హృదయం చాలా తేలికపడింది. అతని కీ బాధ్యతకన్న జైలుకు పోవటమే హాయిగా ఉంది.

"మొత్తానికి భూషణం చెప్పిందాల్లో ఆబద్ధంలేదు. నేనైదేళ్ళ తరిఫీదు పొంది కబుర్లు చెప్పటం నేర్చుకున్నాగాని నావల్ల పనికాదు. బోలెడంత డబ్బూ, అవకాశాలూ చేతికొచ్చిన నేనిట్లా జావ ఐపోతే, మూడు రూపాయలు జేబులో వేసుకు వెళ్ళిన నాగభూషణం గతేమిటి?" అనుకున్నాడతను.

ఇక తను నిరుత్సాహపడి లాభంలేదు నిరుత్సాహానికి కారణంలేదు. తన మీద ఇంతవరకూ ఏ బాధ్యతాలేదు. లేని బాధ్యతకే తను ఇంతగా కంగారు పడుతున్నాడు. కలలోకూడా అనుకోవటానికి వీల్లేని వింత అనుభవం దొరికినప్పుడు దాన్ని వృధాపోనివ్వటం దేనికి? ఒకవేళ తన్నెవరన్నా పట్టుకున్నా తనకేమీ ప్రమాదంలేదు నిజానికి ఈ ఆలోచన చేసినవాడు భూషణం... భూషణ్! ఇక ఆ పేరు తనదే—నెలరోజులపాటు.

సుబ్రహ్మణ్యం భోంచేసి కాస్సేపు విశ్రాంతి తీసుకుని రెండు గంటల ప్రాంతాల డ్రెస్ వేసుకుని కడపా ఏజెన్సీస్ ఆఫీసుకు బయల్దేరాడు. అతను దిగిన హోటలు కా ఆఫీసు మైలులోనే ఉన్నట్టు తెలియటంవల్ల కాలినడకనే సాగాడు. రైల్లో భూషణ్ తనకు చెప్పిన వివరాలన్నీ రాసుకున్న కాగితంముక్క పైకి తీశాడు. ఆఫీసు మేనేజరు పేరు సర్వభద్రంగారు. మంచి తెలివిగలవాడు. తనకు ఆఫీసు విషయాలన్నీ ఆయనద్వారా తెలియవలిసిందే. తన విజిటింగ్‌కార్డ్లు జేబులోఉన్నైన్నె, పర్సున్నది. ప్రస్తుతం సర్వభద్రంగారిని చూసి ఆయన చెప్పేది వినటంతప్ప తను చెయ్యతగినదీ చెయ్యగలిగినదీ ఏమీలేదు.

కడపా ఏజెన్సీస్ చాలా ఇరుకైన సందులో, తొక్కిడి జాస్తిగా ఉండే ప్రదేశంలో ఉన్నప్పటికీ లోపల చాలా అందంగా ఉన్నది. మంచి అందమైన కుర్చీలూ బల్లలూ అమర్చారు. నలుగురైదుగురు గుమాస్తాలున్నారు. తను లోపల అడుగు పెట్టగానే ఎడంచేతివైపు గది తలుపుమీద "మేనేజర్" అని రాసి ఉంది. తనను చూస్తూనే ఒక గుమస్తా లేచి వచ్చి "ఎవరు కావాలండీ?" అని అడిగాడు.

''సర్వభద్రంగా రున్నారా ? నాపేరు భూషణ్!'' అన్నాడు సుబ్రహ్మణ్యం. వెంటనే గుమాస్తా మొహంలో ఏదో మార్పు కలిగింది. అది తనకు హితమైన మార్పో, కాదో అతను తేల్చుకోలేక పోయినాడు. ఈలోపుగా గుమాస్తా "దయచెయ్యండి!" అంటూ అతన్ని మేనేజరుగారి **గదికేసి** తీసుకుపోయి నాడు.

సుబ్రహ్మణ్యం తలుపు తియ్యబోతుండగా తలుపు దానంతట అదే తెరచుకుని, ఒక అందమైన అమ్మాయి ఇవతలికి వచ్చింది. ఆమె చేతిలో పెన్సులూ, షార్టు హాండు నోటుబుక్కూ చూస్తూకూడా సుబ్రహ్మణ్యం అర్థం చేసుకోలేకపోయి నాడు. అతను పంతులమ్మలనూ, నర్సులనూతప్ప ఉద్యోగాలుచేసే ఇతర ఆడ వాళ్ళను చూడలేదు. ఈ ఆఫీసుకూ ఒక లేడీ స్టెనోగ్రాఫ రున్నదని అత నను కోలేదు. ఆ పిల్ల అందంగా ఉన్నదిగాని ఆమె మొహం చిటచిట్లాడుతున్నది. తననుచూసే ఆమెకు కోపం వచ్చి ఉండా లనుకున్నాడు, సుబ్రహ్మణ్యం. తనతో మాట్లాడిన గుమాస్తా అప్పుడే ఇతర గుమాస్తాలతో ఏదో చెబుతున్నాడు. వాళ్ళంతా తనకేసి చూస్తున్నారు. ఇందరి కళ్ళూ తనమీదే ఉన్నై. తను దొరికి పోక తప్పదు.

అతను మేనేజరుగది ప్రవేశించి, నెత్తిమీది టోపీ తీసి, "**సర్వభద్రంగారా?**" అన్నాడు. లోపలికెవరో వస్తున్న ఆచోకీపట్టి, చాలా పనిమీద ఉన్నట్టు నటిస్తున్న సర్వభద్రంగారు తల ఎత్తి, "మీరు—" అని ఆగాడు.

"భూషణ్''

సుబ్రహ్మణ్యాని కెక్కడలేని ధైర్యమూ, ఉత్సాహమూ వచ్చినై. తీరా చెయ్యటం మొదలుపెట్టేటప్పటికి వంచన చాలా ఉత్సాహకరమైనదిగానే కని పించింది. అనుమానించి అనుమానించి వచ్చిన ఈ ఉత్సాహం అతనిలో లేనిపోని తొందర తెచ్చిపెట్టింది. మేనేజరు భుజం మీద తట్టుదామని అతనికి ఒక వెర్రి ఆవేశం కలిగింది. ఈ ఆవేశాన్ని తను నిగ్రహించాలని సుబ్రహ్యణ్యం వెంటనే తెలుసుకున్నాడు. అతివృష్టి ఐనా చిక్కే!

వచ్చినవాడి పేరు తెలుసుకోగానే మేనేజరుగారి వాలకంలో పెద్దమార్పు వచ్చింది. ఆయన గబగబా కుర్చీలోనించి లేచి, నమస్కారంచేసి, సుబ్రహ్మణ్యానికి కుర్చీ చూపించి అతను కూర్చునేదాకా ఆగి అప్పుడు తనుకూడా కూర్చుని, "ఎప్పుడొచ్చారు ? ఎక్కడ దిగారు ? హోటల్లో తమకు వసతిగా ఉందా ? లేక, ఎక్కడన్నా మంచి ఇల్లు చూడనా ?'' అంటూ ఓ వందప్రశ్నలు వేశాడు. గుమాస్తా నొకణ్ణి పిలిచి, వెంటనే టీకి ఆర్డరు చేశాడు.

సుబ్రహ్మణ్యానికి సర్వభద్రాన్ని చూస్తే చాలా మంచిఅభిప్రాయం కలిగింది. ఆయనచేస్తున్న మర్యాద యావత్తూ తన నోటవచ్చిన 'భూషణ్' అనే పేరుకూ, తను ధరించిన నాగభూషణం దుస్తులకూ మాత్రమేనని తెలిసినప్పటికీ సుబ్రహ్మణ్యం ఆనందాన్ని నిగ్రహించుకోలేకపోయినాడు.

''నేను బహుశా ఇక్కడే వుండిపోతాను. మా నాన్నగారెంతో కష్టపడి పైకితెచ్చిన ఈ వ్యాపారం పాడుకాకుండా చూడటమే నా జీవితానికో కర్తవ్యంగా పెట్టుకున్నాను. అందుకని నాకు మీ వీలునుబట్టి సమయం దొరికినప్పుడొక చిన్న — ఒక అందమైన ఇల్లు చూడండి.''


"చిత్తం తమ వివాహం గురించికూడా విన్నాను'' అన్నాడు సర్వభద్రం ముసిముసి నవ్వు నవ్వుతూ.

"నా— ఓహో ! అవును !" అన్నాడు సుబ్రహ్మణ్యం, ఆ పిల్లపేరు జ్ఞాపకం తెచ్చుకోవటానికి ప్రయత్నిస్తూ.

"సుశీలకు పరీక్షలయిపోయినా యనుకుంటాను. మీరింకా ఆమెను కలుసుకోలేదేమో ?''

"లేదు, లేదు" అన్నాడు సుబ్రహ్మణ్యం సుశీల పేరు నాలుగుసార్లు జపం చేసుకుని. "మా నాన్నగారు జబ్బులో ఉండగా మీరు ఒంటిచేత్తో వ్యాపారం సక్రమంగా నడిపినందుకు చాలా కృతజ్ఞుణ్ణి, ఇంకోరైతే నిజంగా-"

సర్వభద్రం చేతులు జోడించి, "అల్పుణ్ణి ! నాదేముంది ? నేను నిజంగా ఈ వ్యాపారం ఒక రస్తాకు తేవడానికేం పాటుపడ్డానో ఆ మహాపురుషుడికి తెలుసు. చచ్చి ఏ స్వర్గాన ఉన్నారో ! మన ప్రయోజకత్వం ఏముందండీ ? నిమిత్త మాత్రులం. నాలో ఏమన్నా గొప్పతనం ఉంటే అది నాకు మీనాన్నగారిచ్చినది. ఆయన నామీద ఉంచిన గురి ! అది తల్చుకుని, 'ఆహా ! నేను నిజంగా గొప్పవాణ్ణి !' అనుకుంటాను. కాని నాలో స్వతస్సిద్ధంగా ఏమీలేదు. ఆయన నాలో ఎంత విశ్వాసం ఉంచారో నేనూ అంత నమ్మకంగా పనిచేశాను. నా చేతిమీదిగా



లక్షలు వాడాను. ఆ మహానుభావు డెప్పుడైనా లెక్క అడిగి ఎరుగునా?... ఆ రోజులు రావులెండి! ఆయనతోనే పోయింది నా గొప్పతనం! 'కృష్ణరాయలతో దివి కేగలేక బ్రతికియున్నాడ జీవచ్ఛవంబ నగుచు' అన్నట్టుంది నా సామెత," అని ఉపన్యాసం దంచాడు.

నిజానికి సర్వభద్రం నాగభూషణం తండ్రిగారి హయాంలో చాలా డబ్బు తిన్నాడు. వీలు కనిపెట్టి చాలా చేతివాటు వేశాడు. అది చచ్చిపోయిన ముసలాయనకు తెలుసు. అనేకసార్లు ముసలాయన సర్వభద్రాన్ని పదిమందిలో పట్టుకుని గట్టిగా చీవాట్లుపెట్టాడు. కాని సర్వభద్రం బతకనేర్చినవాడు కనక అన్నీ పడి, ఏదోవిధంగా తిరిగి తన యజమాని సుముఖత్వం సంపాదిస్తూ ఆయన

కాళ్ళు పట్టుకునో, గడ్డం పట్టుకునో తన మేనేజరు పనికి భంగం రాకుండా కాపాడుకుంటూ వచ్చాడు. ముసలాయన పోయి మూణ్ణెల్లు కావస్తున్నది. ఈ మూణ్ణెల్లనించి సర్వభద్రంగారు తనకూ, తన యజమానికీ ఉండుకున్న పార స్పర్యం గురించి నోటికి వచ్చిన అతిశయోక్తులల్లా చెబుతూ వస్తున్నాడు.

ఆయన చెప్పిన ప్రతి ముక్కా సుబ్రహ్మణ్యం విశ్వసించాడు. ఆయన ఆ మాటలు చెప్పే ధోరణి చూస్తే వాటిని సందేహించటం మాట అటుంచి, అవి వినటానికే తనకు అర్హత లేదనిపించిందతనికి. సర్వభద్రం చెప్పిన విషయాలు తెచ్చిపెట్టిన మైకంలోంచి బయటపడి మామూలువిషయాలు మాట్లాడగలగడానికి రెండు నిమిషాల మౌనం అవసరమయింది సుబ్రహ్మణ్యానికి. ఆ మౌనం విలువ గుర్తించిన సర్వభద్రం దాన్ని భంగపరచటానికి ప్రయత్నించలేదు.

"మీ సహాయంతో నేను వ్యాపారాన్ని మళ్ళీ కొంచెం మంచిస్థితికి తీసుకు రాగలనని ఆశగా ఉంది. నేను ప్రత్యేకించి చేసేదేమీ లేదనుకోండి. అయినా రోజూ నేనుకూడా ఆఫీసుకు వస్తాను. నాక్కూడా ఒక గది ఏర్పాటు చేయించండి" అన్నాడు సుబ్రహ్మణ్యం చివరకు.

"దానికేం? కాని కనీసం ఒకటి రెండు నెల్లపాటు సుశీల మిమ్మల్ని వ్యవహారంలో దిగనిస్తుందనుకోను. మీ రాకకోసం ఆ పిల్ల మహా ఎదురుచూస్తున్నది" అంటూ సర్వభద్రం, సుబ్రహ్మణ్యం మొహాన్ని వెయ్యికళ్ళతో పరీక్షచేశాడు. ఆ మొహంలోకి రావగిన ఆనందం రాలేదు. తను చెప్పినమాటలు అతనికి వినిపించలేదా అన్నంత అనుమానం కూడా ఆయనకు కలిగింది. కాని అతను చిన్నగొంతుతో 'సుశీల' అని గొణుక్కోవటం వినిపించింది.

"నాకీ గదీ, ఇల్లూ ఎంతత్వరలో యేర్పాటు చెయ్యగలరు?" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"మీ యిష్టం. ఇల్లు రేపూ ఎల్లుండిలోపుగా దొరికితీరుతుంది. ఆఫీసుగది ఒక గంటలో తయారుచేయిస్తాను. మీ గదికి టెలిఫోను ఎక్స్టెన్షను పెట్టించమన్నారా?"

"పెట్టించండి. మనతో వ్యవహారంచేస్తున్న పెద్దవాళ్ళను నలుగుర్నీ పిలిచి ఇక్కడ ఒక చిన్నపార్టీ ఇద్దాం. ఏమంటారు?" ఈ ఆలోచన సుబ్రహ్మణ్యానికి సరిగా ఆ క్షణానే కలిగింది. అతను తన చొరవకూ, ఆలోచనకూ ముగ్ధుడై పోయినాడు. "ఇటువంటి పనులు ఇంగ్లండులో తరుచు చేస్తారు" అన్నాడతను సాహసించి.

"మీకు తెలీని దేముందీ!" అన్నాడు సర్వభద్రంగారు.

"నేనిక వెళ్ళివస్తాను. మళ్ళీ రేపుఉదయం వస్తాను" అని సుబ్రహ్మణ్యం శలవు తీసుకున్నాడు. పోతూ గుమస్తాలకేసి చూసి, వీళ్ళుచేసే ఉద్యోగమంటిది సంపాదించటానికి నాబోటివాడి కెన్ని సంవత్సరాలు పడుతుంది?..." అన్నట్టు భూషణం యేమైనాడో! అతనిదగ్గిర డబ్బులేదు. ఈపాటికి ఉద్యోగం సంపాదించి ఉంటాడా? ఎట్లా సంపాదిస్తాడు? ఎందుకు చేశాడీపని?.. ఏం వింత మనిషి!" అనుకున్నాడు సుబ్రహ్మణ్యం.

## 4

"నాయనా, ఒక్క క్షణం ఆగవోయ్!"

సుబ్రహ్మణ్యం వెనక్కు తిరిగి చూశాడు. తను ఇంతకుపూర్వం ఆఫీసులో చూసిన గుమస్తాల్లో ఒకడు. ముసలాయన.


"నేనూ ఇంటికి పోతున్నాలే. కొంతదూరం నీ వెంట నడుస్తాపద. నిన్ను నే నెప్పుడో... పసితనంలో చూశా, మీ తల్లిగారు జీవించి ఉండగా, మహా ఇల్లాలు! ఆవిడ పోయినాక నువు మీ మేనమామగారింట పెరిగావాయెను. ఇహ మళ్ళీ చూణ్ణేలేదూ. అవునా?... ఇవాళ వచ్చావూ? చాలా సంతోషం. పెద్దవాడివై నావూ, సకలవిద్యలూ చదివావూ, నానా దేశాలూ చూశావూ! ఈ వ్యాపారం ఇక నువే చూసుకోవచ్చు. నీ అంత చదువు చదివినవాడికిదో బ్రహ్మవిద్యటగాని! ఇప్పుడు వెనకటిమాదిరిగా గిట్టింపు కావటంలేదు నాయనా! నలుగురూ నాలుగు మాటలూ అంటారు మన మేం చెప్పగలం?... నే నెప్పటివాణ్ణనుకున్నా వేమిటి? నే నాఫీసులో అడుగుపెట్టేటప్పటికి మీ తండ్రిగారికి సరీ... షూ నీ వయసు! అంతా నీలాగే ఉండేవారనుకుంటూ! అయిందా?... ఏమిటీ చెప్పొచ్చానూ!— ఆఁ! నేనిప్పుడు పనిలో ఉండి చేస్తున్నదేమిటీ?... ఏమీలేదూ! జీతం పుచ్చుకుంటున్నా నంతే! మీ నాన్నగారలాటి ఏర్పాటు చేసిపోయినారు. ఆయన ఇహ బతకరూ అని తెలియగానే నేనాయన కాళ్ళమీదపడి నామాటేంచేస్తారని అడిగా. 'నువు బతికున్నంతకాలమూ నీ ఉద్యోగం ఖాయమే పోరా' అన్నారు. బహు స్నేహపాత్రుడు, బహు స్నేహపాత్రుడు!... చెప్పొచ్చిందేమిటీ? మీ నాన్నగారా, బహు దొడ్డవాడనిపించుకున్నవాడు. నువ్వా, బుద్ధిమంతుడివే అనుకో— కుర్రవాడవు. మంచికేగాని గాక, నువ్వేంచేసినా నలుగురూ వెంటనే 'ఇదంతా ఇప్పుడు కొత్తగా వచ్చిందిగాని వెనక వీరి తండ్రిగారి హయాంలో ఇవన్నీ ఉండేవా' అంటారు. అఁహఁ! మాటవరస కంటున్నానుమా! ఓ గొప్పవాడి

వెనక అతడి స్థానంలో వచ్చేవాడి పని కష్టమేనయ్యా! అదికాస్త జ్ఞాపకం ఉంచుకో, ఓ మూల. త్వరగా నిరుత్సాహపడకు. నీ బుద్ధికి తప్పు అని తోచింది వెయ్యిమంది చెప్పినా చెయ్యకు. రైటని తోచింది మానకు. మీ నాన్నగారిలాగే చేశారు. అబ్బో! ఆయన్ని ఎంతమంది ఎన్నిసార్లు నిరుత్సాహపరిచిందీ నేనెరుగుదును. అయింది, అయిపోయింది, దివాలా ఎత్తేస్తున్నాడన్నారు... అలా ఉంటుంది లోకం! అ... నేనెళ్ళొస్తా మరి శలవు."

ముసలాయన చెప్పిన మాటలన్నీ తను నాగభూషణమే అనే తన్మయత్వంలో విన్న సుబ్రహ్మణ్యానికి తనెవరో జ్ఞాపకంరాగానే విచారంవేసింది. తన నెల గడువులో ఇంకా ఒక రోజైనా గడవలేదు-సంవత్సరం గడచినట్టుగా అనిపిస్తున్నప్పటికీ! ఇంకా ఇరవై తొమ్మిదిరోజు లిటువంటివి గడపాలి ఇంకా ఎంతమంది తనతో ఇట్లా మాట్లాడుతారు? వీళ్ళు మాట్లాడేది వినటానికి తన కధికారం లేదు. నాగభూషణం తనమీద ఈ బాధ్యత పెట్టటం అన్యాయం ఈ విధంగా నాగభూషణం జీవితం జీవిస్తూపోతే తను నాగభూషణం కాలేకపోయినా సుబ్రహ్మణ్యం కావటం మానుకుంటాడు. ఇది తనకు మొదటి అనుభవంకాదు. వెనక మూడు నాలుగేళ్ళ క్రితం ఎవరో పెద్దమనిషి తనను చూసి గుర్తించినట్టు భావించి తన తండ్రినిగురించీ, చుట్టాలనుగురించీ అయిదారు నిమిషాలు మాట్లాడి తను పొరపడ్డట్టు అప్పటికి తెలుసుకుని, 'అయ్యో, నువు శివశంకరం కొడుకువుకదూ?' అనేటప్పటికి హృదయంలో ఏదో చెయ్యి పెట్టి కెలికినట్టయింది. ఆ పెద్దమనిషి ముహాన కనిపించిన వికారం చూస్తే ఆయన మీద జాలి కలిగింది. ఆయన తనలో తెచ్చి పెట్టిన వికారం చూస్తే కోపంవచ్చింది. ఆ సంఘటన జ్ఞాపకం వచ్చినప్పుడల్లా తనకు చాలా రోజులపాటు మళ్ళీ మళ్ళీ అదే వికారం కలుగుతూ వచ్చేది. అదేమి వికారమో తనకు తెలిసిరాలేదు గాని ఆ వికారమే ఇప్పుడూ తనకు కలుగుతున్నది.

సుబ్రహ్మణ్యం నేరుగా హోటలుకు వెళ్లి దుస్తులు మార్చుకుని ఒక పలుచని ధోవతీ, మల్లులాల్చీ వేసుకుని యేదైనా సినిమా చూడాలని బయల్దేరాడు.

అతను సినిమాహాలు చేరేటప్పటికి అప్పుడే ఒక ఆట వదిలిపెట్టారు. వెళ్ళే జనంలో ఎవరో ఆడవాళ్లు 'సుశీలా' అని పిలిచినట్టు సుబ్రహ్మణ్యం చెవికి తోచింది. పొయ్యే జనాన్ని కళ్ళతో ఎంత గాలించినా పిలిచిన మనిషినిగాని, పిలవబడ్డ మనిషినిగాని ఉజ్జాయింపుగానన్నా నిర్ణయించడానికి లేకపోయింది. పోతున్న జనం కావటంవల్ల అతనికి తాపీగా చూసే అవకాశమూ లేకపోయింది.




టిక్కెట్టు కొనుక్కునేటందుకు వెళ్ళేటప్పటికి అక్కడ తన ఆఫీసులో— భూషణం ఆఫీసులో-కనిపించిన అమ్మాయి కనిపించింది. ఆమె తనని చూడలేదో, చూడనట్టు నటిస్తున్నదో అతనికి తెలియలేదు. అతను మాత్రం పనిపెట్టుకుని, "హల్లో!" అన్నాడు. ఆమె అతనికేసిచూసి, "మీ రిందాక ఆఫీసుకొచ్చారా?" అన్నది.

"అవును. నే నెవరో తెలీలేదా?" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"నాకు తెలీదు" అన్నదామె.

సుబ్రహ్మణ్యం అర్థం చేసుకున్నాడు, ఆమె కెవరు చెప్పిఉంటారు?

"నేను ఫలానా అని సర్వభద్రంగారు చెప్పలేదా?"

"చెప్పలేదు. పోనీ, మీరు చెప్పండి, మీ రెవరు?" అన్నదామె చిరునవ్వు నవ్వి.

"నేను—నేను కడపా ఏజెన్సీస్ ప్రొప్రయిటర్ని."

ఆ మాట వినగానే ఆమెనవ్వు మాయమై ఏదోవిధమైన భయం వచ్చి దాని స్థానం ఆక్రమించుకుంది. "నాకు తెలీదు—క్షమించండి—ఎంత మందమతిని" అని ఆమె మాటల్లో తడబడ సాగింది. తను నిజంగా భూషణమే అయినా తన మూలంగా ఆమె అంత ఖంగారు పడటం సుబ్రహ్మణ్యాని కిష్టంలేదు అటువంటప్పుడు తను భూషణం అనుకునే భ్రమతో ఆమె అట్లా బెదరటం అతనికిమరింత దుర్భరమై, లోపల తన్ను శపించుకుంటూ, పైకినవ్వి, "సినిమా కేనా?" అన్నాడు.

ఆమె ఔనని తల ఊపినమీదట అతను రెండు ఖరీదైన టిక్కెట్లు కొనిఆమెతో కలిసి హాల్లోకి వెళ్ళి కూచున్నాడు. ఆమె ఎక్కువగా మాట్లాడే స్వభావం కలదిగా కనిపించలేదు. హాల్లో వేసే రికార్డులవెంట కూనిరాగంగా పాడుతూ కాలితో తాళం వేస్తూ కూచున్నది. అతి సాహసంమీద అమె పేరు లూసీకేటర్స్ అనీ, ఆమెకు నలభై రూపాయలు జీతమిస్తున్నారనీ తెలుసుకున్నాడు. తన జీతం చూసి అత నాశ్చర్యపడటం గమనించి అమె, "మా తండ్రి ఇంజను డ్రైవరు. నెలకు రెండు వందలు సంపాదిస్తాడు. నా సంపాదన నా పైఖర్చుకు మాత్రమే" అన్నది నవ్వుతూ

"నువు మా ఆఫీసులో ఎంతకాలంగా ఉంటున్నావు?"

''నాలుగు నెల్లనించీ"

''మా వ్యాపారం ఏస్థితిలో ఉంది?"

లూసీ అతనివంక విచిత్రంగా చూసి "మీకేతెలుస్తుందిలే'' అన్నది.

"నీ వంటివాళ్లు చెప్పకపోతే ఎట్లాతెలుస్తుంది?"

''అయితే మీవ్యాపారం చాలా బాగుందనే చెప్పాలి."

"అంతే?"

"మీ మేనేజరు నెలకు వెయ్యి రూపాయలకు తక్కువ కాకుండా బాంకులో వేస్తున్నాడు.''

సుబ్రహ్మణ్యం ఒక్కక్షణంపాటు మాట్లాడక "నమ్మదగిన విషయమేనా?" అన్నాడు

"తప్పకుండా" అన్నది లూసీ.

## 5

తను భూషణం అనుకోవటం సుబ్రహ్మణ్యాని కెంత కష్టమయిందో, తను సుబ్రహ్మణ్యం అనుకోవటం భూషణానికీ అంతకష్టమయింది.

భూషణం రైలుదిగుతూనే సత్రానికిపోయి అక్కడ తన—సుబ్రహ్మణ్యంది-పక్కచుట్ట పడేసి, భోజనం చేసి, వెంటనే ఉద్యోగంకోసం కాలినడకన ఊరి మీద పడ్డాడు. ఉద్యోగం దొరకదనే సందేహం అతని కేకోశానా లేదుగాని, అ ఉద్యోగంగురించి అదివరకు తట్టని పెద్ద చిక్కొకటి భూషణాని కిప్పుడే తట్టింది. తన కొకవేళ ఉద్యోగం దొరికినా జీతం ముట్టేది నెలాఖరునగదా? అందాకాతనకు తిండికేదీ? ఈ నెల ఇంకా పదిరోజులుంది. మూడు రూపాయలతో పది రోజులు గడిచేదెట్లా? పైఖర్చు ఏదీ? 'ఇది నిజంగా ఉద్యోగ సమస్య కాదు—ఒకవిషమైన

పెట్టుబడి సమస్య. దీన్ని తను ఎదుర్కోవలసి రావటం అన్యాయం' అనుకున్నాడు భూషణం. కాని అది ఏ సమస్య అయినా ఆఖరుకు సుబ్రహ్మణ్యం సమస్యేగా? ఇప్పుడతని సమస్యలన్నీ తనవేగా?

ఈ ఉద్యోగాలిచ్చే దురాత్ములు ఆ ఇచ్చేజీతం డబ్బులు మనకు కావలసిన విధంగా—రోజువారీగా కావాలంటే రోజువారీగానే—ఎందుకివ్వరూ? బొత్తిగా పరపతిలేనివాణ్ణి కూలీపనికి తరమటానికి పెట్టుబడిదారీ పన్నిన పన్నాగం కాదు గదా!...ఇంకేముందీ? తనూ సోషలిష్టల్లే ప్రతిదానికీ పెట్టుబడి దార్లను సందేహించటం మొదలుపెట్టా డప్పుడే! నిజానికి ఇంతకంటె పెట్టుబడిదారీ ముదిరిఉన్న దేశాల్లో వారం వారానికీ జీతాలివ్వటంలా?...దాని శిగ్గోసిరి! ముందు తనకర్తవ్యం ఏమిటి? తనకు వెంటనే డబ్బులు చేతిలోపడే ఉద్యోగం కావాలి ఇతర విషయాలెట్లాఉన్నా తిండి కిబ్బంది పడరాదు. హోటల్ సర్వరుగా చేరితే?...అసంభవం. అర్ధమైనవాళ్ళ దగ్గిరా నిలబడి ఆ వెధవ తినుబండారాలు ఏకరువు పెట్టటం తన వల్ల చచ్చినా కాదు. ఎక్కడన్నా ఉద్యోగం చూసి అక్కడే ఓ పదిరూపాయలు ఎడ్వాన్సుకూడా పుట్టించాలి...ఇంతకూ తనుచెయ్యగల—అధమం, సుబ్రహ్మణ్యం చెయ్యగల—ఉద్యోగం ఏమిటి?

చిన్న కాగితం ముక్కమీద సుబ్రహ్మణ్యం వంటివాడు చెయ్యగల ఉద్యోగాల జాబితా రేసుకున్నాడు

1. చెప్పించుకునేవాళ్ళుంటే హైస్కూలు పిల్లలకు ట్యూషన్లు.
2. ఏదన్నా ప్రెస్సులో ప్రూఫురీడరుపని, ఏంజీతమిస్తారో?
3 దినపత్రిక ఆఫీసులో వార్తలు తర్జుమా చెయ్యటం.
4. ఇన్సూరెన్సు యేజంటు.
5. ఎడ్వర్టయిజింగ్ యేజంటు.
6. కమిషను యేజంటు.
7 సినిమా యాక్టరు. (ఇది మంచి ఆలోచనే. లాడ్జిలోపడి తినవచ్చుకూడాను!)

ఇంతవరకూ లిస్టురాసి భూషణం కాగితం చించి పారేశాడు. సినిమాఉద్యోగం అన్నివిధాలా క్షేమయినదిగా కనిపించింది. అయితే సినిమా వాళ్ళెక్కడుంటారో. దారిలో ఎదురైన మొదటి తెలుగువాణ్ణి పట్టుకుని భూషణం సినిమావాళ్ళెక్కడుంటారని అడిగాడు. ఆ తెలుగు మనిషి రెండు మూడు చోట్లు సూచించాడు. భూషణం సాహసించి బస్సెక్కి ఒక సినిమా లాడ్జికి ప్రయాణమైనాడు.

లాడ్జిలో ఎవరూ లేరు. ముఖ్యమైన వాళ్ళందరూ షూటింగుకు పోయినారు. ఆడే పని పాటలు లేనివాళ్లు మిగిలారు. వాళ్ళతో బాతాఖానీ ప్రారంభించాడు భూషణం.

అక్కడ ఉన్నవాళ్ళల్లో ఒక సంఖ్యా శాస్త్రం తెలిసిన పెద్దమనిషి ఉన్నాడు. అతను భూషణాన్ని చూసి, "మీకు చక్కని పర్సనాలిటీ ఉందండీ. మీరు సినిమాలో వేషాలు వెయ్యొచ్చునే" అన్నాడు.

"ఎవరన్నా ఛాన్సు ఇవ్వాలేగాని నా అభ్యంతరం యేమీ లేదండీ" అన్నాడు భూషణ్.

"మీ మొహంలో మహాయోగం కనిపిస్తున్నది. ఎప్పుడన్నా గొప్పఉద్యోగం యేమన్నా చేశారా?" అన్నాడు సంఖ్యాశాస్త్రవేత్త.

"లేదే!"

"బహుశా మీ పేరులో ఏదో లోపం ఉండి ఉంటుంది. మీ పేరేమిటన్నారూ ? స్పెల్లింగు చెప్పండి!...నే చెప్పలా? మీరు మీ పేరు బి. ఎస్. శాస్త్రి అని మార్చుకోండి. ఇక మీ కడ్డుండదు. ఈ మాట ఫలానప్పుడు ఫలానివాడు చెప్పాడని కలకాలమూ జ్ఞాపకం పెట్టుకుంటారు. మీకు సంగీతం పాట్టం వచ్చా?... అయితే యేం లెండి? మన రెడ్డిగారూ, నాయుడుగారూ రాంగానే మిమ్మల్ని తీసుకోమని చెబుతాను. మీరు మాత్రం నే చెప్పినట్టు పేరు మార్చుకోవాలి మరి."

బడుగు సుబ్రహ్మణ్యం అనే పేరు చూసి ఉద్యోగం ఎవడిస్తాడనో ఏమో, తన రైలుస్నేహితుడన్న ముక్క ఈ విధంగా నిజంకావటంచూసి భూషణానికి నవ్వొచ్చింది. ఈ సంఖ్యాశాస్త్రవేత్త వాగ్దానం నమ్మి తన కక్కడ పొద్దూకేదాకా ఉండ బుద్ధయినందుకూడా అతని కాశ్చర్యం వేసింది. బీదవాళ్ల చేతికర్ర లిట్లాగే ఉంటై కామాల్ననీ, ఈ మాత్రం ఆధారం చిక్కకుండా ఎంతమందిజీవిస్తున్నారో ననీకూడా అత నాశ్చర్యపడ్డాడు. ఇంత నిరాధారమైన జీవితం జీవిస్తారు గనక బీదలకు యేకాస్త కలిసొచ్చినా అది భగవంతుడి కృప అనిపించటాని కవకాశం ఉంది. తన విషయమే చూడవచ్చుగా! తనకు తట్టిన మిగిలిన అన్నింటినివొదిలి పెట్టి, అకస్మాత్తుగా యే సినిమా పోస్టరో చూసి తట్టిన ఈ ఆలోచనను పట్టుకోవట మేమిటి? ఆ సినిమాలలోకూడా ప్రత్యేకించి ఇక్కడికే రావట మేమిటి? సమయానికి దైవజ్ఞుడు ఇక్కడ తటస్థపడటం యేమిటి? (ఇతను నిన్ననే వచ్చాట్ట. మళ్ళీ రేపో ఎల్లుండో వెళతాట్ట) ఈ సంఘటనల్లో యేరెంటికీ పరస్పర సంబంధం లేదు. ఇందులో యేది ఒనగూడక పోయినా తన కీమాత్రం ఆశ




చిక్కదు ఇదంతా అమాయికహృదయం కలవాడికి దైవమాయగా తోచటంలో వింత యేముందీ?

కాని ఈ భాగ్యవంతులక్కూడా—లక్షలేసి పోసి సినిమాలు తీసేవాళ్లక్కూడా—దైవజ్ఞుల సహాయంలేకుండా జరక్కపోవట మేమిటి? ఈ దైవజ్ఞుడు చెప్పే ముక్కలు నిజమైతే ప్రతి సినిమా ప్రొడ్యూసరూ అతని క్లయంటే నల్లే ఉంది! తమ ఆశయాలకూ ప్రయత్నాలకూ, ఫలితాలకూ శాస్త్రీయమైన సంబంధం ఉండే అవకాశం ఉందనే విశ్వాసం డబ్బున్నవాళ్ళకు లేదూ! ఇటువంటి ధనికులకు తనకన్న ఎక్కువ బతికే అవకాశా లుండటం చూస్తే సుబ్రహ్మణ్యానికి మండదూ మరి? అతనిపాటి కేం చేస్తూ ఉంటాడో! పాపం తన వ్యాపారంతో ఎట్లా కుస్తీపడతాడో! లేక బెదిరిపోయి బయట పడతాడో! అతని విషయంకాస్త ఆరా తియ్యాలి...

ఆరు గంటలకల్లా కార్లమీద పడి ఉస్సురోమంటూ షూటింగుకు పోయిన వారంతా దిగారు. సంఖ్యాశాస్త్రవేత్త వెంటనే భూషణం విషయం రెడ్డిగారితోనూ, నాయుడుగారితోనూ చెప్పేశాడు, అన్నదానికి చచ్చు లేకుండా.

"ఈ భాగ్యానికి నాతో చెప్పాలిటయ్యా? రమ్మను. ఆ సుదర్శనపాత్రనుకూడా పెద్ద వాడుగా చూపిస్తేగాని కథ బాగా నడవదని మన కవిగారు చంపుకు తింటుం డెనుగా...ఇంతకూ మనిషేమన్నా కాస్త ముక్కూ మొహమూ ఉన్న వాడేనా?" అన్నారు రెడ్డిగారు.

"సరేలే, హీరోను తినేస్తాడు! ఇంతకు మునుపుకూడా ఇక్కడే ఉన్నాడే!...శాస్త్రిగారూ! శాస్త్రిగారూ!" అంటూ కేకపెట్టాడు దైవజ్ఞుడు.

రెండోకారులోనించి అప్పుడే దిగిన ఆడజనాన్ని చూస్తూ కొంచెం అవతలగా నిలబడ్డ భూషణానికి 'శాస్త్రిగారూ' అన్న పిలుపు వినపడ్డదిగాని అది తనకు సంబోధించబడిందని అతని కనుమానమే పోలేదు. ఇంతలో దైవజ్ఞుడే వచ్చి, "అన్ని కేకలు పెడుతుంటే పలకవేమయ్యా? రెడ్డిగారు పిలుస్తున్నారు. నీపేరు ఏమిటంటే బి. ఎస్. శాస్త్రి అని చెప్పు. రెడ్డిగారికి లెక్కపెట్టటం చాతవు. ఎవరూ లేకుండా చూసి తప్పక గుణిస్తారు. నే చెప్పినమాట అర్థమయిందా?... ఇక పదండి!" అని భూషణాన్ని లోపలికి పట్టుకెళ్లాడు.

రెడ్డిగారు భూషణాన్ని ఎగాదిగా చూసి, "ఫరవాలేదు. అయితే చూడు, నాయనా! నీకిచ్చేవేషం మొదట మేమనుకున్నది కాదు, మా కవిగారి పోరు పళ్లేక పెడుతున్నాంగాని, అందుకని నెలకోవందకంటె ఇవ్వలేను. తరవాత తక్కువిచ్చాడని నన్ను నిష్ఠురం ఆడొద్దు. నేనిచ్చే వాణ్ణయిందీ కాందీ ఇక్కడ ఎరగని వాడెవడూ లేడు. నువ్వేమో వేషానికి పనికొస్తావు నాదగ్గిర దాపరికా ల్లేవు. కాని ఆవేషం అంతకంటే చెయ్యదు. అప్పటికదీ ఎక్కువే. సమ్మతమైతే వెంటనే లాడ్జికి పచ్చెయ్యి. నువ్వెట్లా చేస్తావో ఎరగను గదా. నువు బాగా చెయ్య గలవాడివని తోస్తే నా నెక్స్టు పిక్చర్లో మహరాజు.గా హీరోవేషమే ఇస్తా... నీ పేరేమి టన్నావూ?"

"బి. ఎస్. శాస్త్రుండి!"

"నే నన్నట్టొప్పుకున్నట్టేనా?"

"మీదయ!"

"ఒరే, సత్తెం. ఈపూటో రేప్పొద్దున్నో శాస్త్రిగారు లాడ్జికివచ్చేస్తారు. ఆయన విషయం యేమిటో చూసి—"

"చిత్తం," అని ప్రొడక్షను మేనేజరు ఎవరిచాటునుండో అని ఏదో పనిమీద వెళ్ళిపోయినాడు.

## 6

భూషణానికి సినిమా పరిజ్ఞానం ఏమీ లేకపోయినా, సినిమాలు తెగచూసి. ఉండటంవల్ల చెప్పుకోతగ్గ అభిరుచి మాత్రం ఉంది. అతనికి తీస్తున్న సినిమా ఏమీ నచ్చలేదు. ఏవిషయంలోకూడా ఎవరికీ స్పష్టమైన అభిప్రాయాలున్నట్టు కనిపించలేదు. ఇప్పటికి పదిహేను రోజుల్నుంచీ షూటింగు జరుగుతున్నది.

రోజూ పొద్దునా సాయంకాలమూ కూచుని ఇంకా కథ రాస్తూ మారుస్తూ ఉన్నారు. కొత్త సంఘటనలు తెచ్చిపెడుతున్నారు. ఏమీ చెయ్యటానికి తోచనప్పుడు పాత్రను చంపేస్తున్నారు. ఇంకో ఐడియా రాగానే మళ్ళీ బతికిస్తున్నారు. పూరి గుడిసెల్లో రేడియో సెట్లు తెచ్చి పెడుతున్నారు. తెలుగు స్టేజీమీద 'బాలీ' ప్రదర్శనా లిస్తున్నారు...భూషణానికంతా గొడవగా ఉన్నది.

ఈ సినిమా నిర్మాణానికి చేర్చిన తలలు తనకన్న సరుకున్నవి కావని గమనించి భూషణం అప్రయత్నంగా తన సలహాకూడా ఇవ్వసాగాడు. కానివెంటనే అతనికి పరాభవం అయింది. సినిమా లైనులో వేషం వెయ్యటానికి వచ్చినవాడు వేషంవేసేవాడే గాని ఇంకోటి కాదు. వాడింకేమైనా చెయ్యగలిగినప్పటికీ చెయ్యటానికి ప్రయత్నిస్తే ఉద్యోగం ఊడినంతపని అవుతుంది. ఈసంగతి పెందలాడే గ్రహించి భూషణం ఆ గొడవ వదులుకున్నాడు.

ఇక అతని దృష్టి సంపూర్ణంగా సీతమీద కేంద్రీకరించింది. సీత ఈ పిక్చర్లో వేషం వేస్తున్నది. ఆమెకు పద్దెనిమిది, పందొమ్మిదేళ్ళదాకా ఉంటై. తండ్రి బ్రాహ్మడు. తల్లి లేచివచ్చినబాపతు అని తెలిసింది. ఆమెకింకా నలుగురైదుగురు తమ్ముళ్లూ, చెల్లెళ్లూ ఉన్నారు. అందరికన్నా ఆమే పెద్దది. ఆమెకు తండ్రి చదువు విశేషం చెప్పించలేదుగాని, పన్నెండేళ్ళపాటు సంగీతం చెప్పించి ప్రవీణురాలిని చేశాడు బాగా పలికే శ్రావ్యమైన కంఠం ఉంది. చాలా పెద్ద పాట పాడుతుంది. రెండేళ్ళనించీ వాళ్ళ ఊళ్లో ఆడపిల్లలకు సంగీతపాఠాలు చెప్పి నెలకు 50, 60, రూపాయలు తెచ్చుకుంటున్నది.

సీతను సినిమాల్లో ప్రవేశపెట్టాలని సంవత్సరంనించీ తండ్రికి పుట్టింది. ఒకప్పుడు సీతకోసం వచ్చిన ప్రొడ్యూసర్లతో పోట్లాడి తిట్టి పంపించినవాడే. కాని సినిమాలో డబ్బున్నది. పొట్టి,ఎందుకూపనికిరాని తుక్కు సరుకు వేలకువేలు గణిస్తున్నది. పరువా? ఈరోజుల్లో సినిమాతారకున్న పరువు జిల్లాజడ్జీలకు లేకుండా ఉంటున్నది. వాళ్ళూ వీళ్ళవెంటే పడుతుండిరిగా! సినిమా స్టారంటేనన్నా పిల్లకు గొప్ప సంబంధం వస్తుందేమో!

తీరా తను అమ్మాయిని తెరమీది కెక్కిద్దా మనుకునేటప్పటికి తీసుకునే ప్రొడ్యూసరు కనిపించలేదు. అసలే పోట్లాడే మనిషి అనేపేరు తెచ్చుకున్నాడు. ఆపైన సీతవెంట తన కుటుంబమంతా కదిలిరావాలంటాడు. సీతను తీసుకోదలచిన ప్రొడ్యూసరు రానూ పోనూ ఏడు టిక్కెట్లూ, కుటుంబానికంతకూ ఇంటిఖర్చూ, తిండిఖర్చూ భరించాలి. ఆఖరుకు పదినెల్లక్రితం ఒక ప్రొడ్యూసరు

దొరికాడు! అన్ని ఖర్చులకూ ఒప్పుకున్నాడుగాని జీతం నెలకు 200 కంటె ఇవ్వనన్నాడు. అట్లాగే తగలెయ్యమన్నాడు సీతతండ్రి. ఆ పిక్చరు రిలీజయిన మర్నాడే సీత సంగీతం గురించి అంతులేని ప్రశంస దేశమంతటా బయల్దేరింది. సీతకు నెల కారువంద లిస్తాము రమ్మంటూ నాయుడుగారూ, రెడ్డిగారూ సీత తండ్రిదగ్గిరికి వచ్చారు ఇప్పుడు సీత ఈ పిక్చర్లో పనిచేస్తున్నది.

ఈ వివరాలన్నీ భూషణానికి చెప్పినవాడు మ్యూజిక్ డైరక్టరు వెంకటేశ్వ ర్రావు.

"అమ్మాయి గొంతూ, వాదుగూ అంతా బాగానే ఉందిగాని, పాటలో ఏదో తక్కువైనట్టుగా తోస్తోందే?" అన్నాడు భూషణం.

"ఆ పిల్ల స్వరంవేసి పల్లవి పాడగల పిల్లండీ! అమ్మాయి కీ చెత్త ఇమిటేషను హిందుస్థానీ మట్లిస్తే ఏం చూపిస్తుంది తన శక్తి?"

"నేనందు కనలేదు. అమ్మాయి పాటలో యేదో అపుకోలేని దూకుడు— restrain కాని ఇమోషన్—కనిపిస్తుందేం?"

"ఆఁ, చండాలుడు - దానితండ్రే దాన్నట్లా చంపుకుతింటున్నాడు. దానికి వెంటనే మొగుడు కావాలి. మగముండాకొడుకుతో పైపై సరసాలన్నా ఆడనిస్తే ఇంత బాధపడిపోదు. అదికూడా లేదు. దాని మంచం చుట్టూ ఎనిమిది మంచాలు పరిచి కోట గడతారు. అది ఒక రాత్రివేళ బయటికి పోవాలన్నా ఎనిమిదిమందీ తోడు వెళ్తారు... మొన్న సెట్టుమీద, దాని తండ్రివేషం వేస్తున్న గోవిందం గారు దాని గడ్డం పుచ్చుకుని 'ఏదో దయలాగు' చెప్పేటప్పటికి అది అట్లాగే కొయ్యబారిపోయింది, నోట మాటలేకుండా. అడుగుతారూ, దాని క్షోభ?"

"పోనీ, దానికి పెళ్ళి చేసెయ్యరాదూ?"

"కులగోత్రాలున్నవాడు దాన్నెవడు పెళ్ళాడతాడండీ? పైగా అదిప్పుడు బంగారప్పిచ్చిక. నెలకు ఎనిమిదివంద లిస్తామనీ, వెయ్యి యిస్తామనీ వస్తున్నారు ప్రొడ్యూసర్లు. అంత డబ్బు వొదులుకుని ముసలాడు కూతుర్ని కులగోత్రాలు లేనివాడి చేతిలో పెడతాడా? వొట్టిమాట! ఎవడన్నా డబ్బున్నవాడు ముసలాడి చేతిలో ఓ లక్షరూపాయలు పెట్టి కొనుక్కుంటేగాని దాని బాధ అంతంకాదు."

"ఈలోపల అది తెగులుపుట్టి చస్తే?"

"అంత కంఠంమీద కొస్తే ఎవణ్ణన్నా నోరులేని వాజను చూసి చాటుగా దానికి వాణ్ణి తగిలిచ్చేస్తాడు. కాని పిల్లనుమాత్రం ఛస్తే ఇంకోడి చేత పెట్టడు.



పోనివ్వండి వెధవపీడ ! మనం ఆర్చేవాళ్ళమా, తీర్చేవాళ్ళమా ?" అన్నాడు వెంకటేశ్వర్రావు

తినేటందుకు చాలీ చాలకుండా ఉండే మధ్యమతరగతికి డబ్బు తెచ్చిపెట్టే సమస్యలు చూస్తే భూషణాని కాశ్చర్యం వేసింది.

భూషణం సీత సమస్యనుగురించి గంటలతరబడి ఆలోచించాడు. ఆమెను తను పెళ్ళి చేసుకునేటట్టయితే, తనకు తగినంత కబ్బున్నదనితెలిస్తే, ముసలాడు ఒప్పుకుంటాడు. కాని తనకు సీత ఎందుకు, బంగారమంటి సుశీల ఉండగా !

ఇతరుల సమస్యలనుగురించి మనం మథనపడటంలో ఇదే చిక్కు. అవి మన నంటనంత వరకే వాటినిగురించి విచారించగలం. తన కితరుల సమస్యలను గురించి ఆలోచించటం ఇదే కొత్త. ఎవరి బాల్యమైనప్పటికీ పచ్చి స్వార్థంలోనే గడుస్తుంది. తన బాల్యమూ అట్లాగే గడిచింది. బాల్యం ముదిరేటప్పటికి తను చదువు పూర్తిచేసి దేశాంతరాలు తిరిగొచ్చాడు. ఆ విదేశీయుల సమస్యలు తన నొక్కొక్కప్పు డాకర్షించినా నిజంగా తన నంటలేదు. ఇప్పుడీ సీత విషయం ఏమాత్రమో తనను పట్టుకుంది ఆమె మాటల్లోనూ, నడకలోనూ కూడా బాధ కనిపిస్తూనేఉంది. పాపం, పైకొచ్చే పిల్ల, సుఖపడితే బాగుండునని తనకున్నది. కాని వెంకటేశ్వర్రా వన్నట్లు తను చెయ్యగల దేముంది?...సుశీల యేం చేస్తున్నదో? పరీక్షలయిపోయిఉంటై.. అసలు దుర్మార్గమంతా ఆ తండ్రిది. వాడు చేజేతులా తన కూతురి గొంతు నులిమేస్తున్నాడు. సీతను గురించి తండ్రికిలేని ఆదుర్దా తనకుండటం చిత్రం!

అయితే భూషణం సీతతండ్రిని గురించి త్వరలోనే అభిప్రాయం మార్చుకున్నాడు. ముసలాడితో అతనికి పరిచయంకాగానే అతని అభిప్రాయం దానంతట అదే మారింది. ముసలాడు చాలా తెలివిగవాడూ, పట్టుదలకలవాడూ, అనేక విధాల సమర్థుడూనూ. తనకేంకావాలో ఆ మానవుడికి చాలా స్పష్టంగా, ఎవరి సలహాగాని అవసరంలేకుండా తెలుసును. ఈ విషయం తెలుసుకున్న తరువాత భూషణానికి ముసలాడు కూతురి విషయంలో తొక్కిన పంథాను విమర్శించే అధికారం తనకులేదని తెలిసిపోయింది.

తనకు సీత కావాలని భూషణం అకస్మాత్తుగా గ్రహించుకున్నాడు. తనలో ఈ పరివర్తన ఎందుకు కలిగిందో భూషణాని కర్థంకాలేదు. తన మనస్సును బలవంతంగా సుశీలమీదికి తిప్పుదామనుకున్నా అది మళ్ళీ సీతమీదికే వస్తున్నది. సుశీల తనకు అనుకున్నంత దగ్గిర్లోలేదు. అయిదారేళ్లు సుశీలను చూసి ఉండక పోవటం తమకిద్దరికీ మధ్య కొంత ఎడం ఏర్పడ్డానికి కారణ మయినట్టున్నది. సుశీలతో కాపరం చెయ్యటంలో రసంలేదు—excitement లేదు. కనీసం సుశీల లేచివచ్చినమనిషి కూతురన్నాకాదు. ప్రతి నదికీ కట్టలు తెంపుకుపోదామనే ప్రేరేపణ స్వతస్సిద్ధంగా ఉంటుంది - అది అనుకున్నప్పుడల్లా సాధ్యంకాదు కాని, తనపేరు సుబ్రహ్మణ్యాని కిచ్చి, అతని పేరూ, డబ్బూ తను తీసుకొని రైలు దిగినప్పుడే భూషణం తన కట్టలకు గండి పెట్టాడు మిగిలిన వ్యాపకాలు

వదిలేసి సినిమాలో అడుగుపెట్టి ఆ గండి మరింత పెద్దదిచేశాడు. దానిమీదట ఈ పరిణామంలో వింతయేమీ లేదు.

భూషణం బుద్ధి చాలా తూకమయినది కనక ఎన్నడూ బయటపడలేదు గాని అతని కోరికలు చాలా ఘాటయినవీ, బలవత్తరమైనవీనూ. వాటి వేగానికి మామూలు అడ్డంకులాగవు సీతను తన సొత్తు చేసుకోవటానికి ఉపాయాలను గురించి తీవ్రంగా ఆలోచించసాగాడు.

## 7

సుబ్రహ్మణ్యానికి ఆఫీసుగది ఏర్పాటయింది. అతనుకూడా మిగతా గుమాస్తాల మాదిరిగానే పదిగంటలకు వచ్చేశాడు. ఆఫీసుకు కొత్తయజమాని వచ్చా డన గానే అత నెటువంటి తత్వం గలవాడయిందీ తెలుసుకోందే పనిచెయ్య బుద్ధి పుట్టదు గుమాస్తాలకు. అక్కడ పనిచేసే వారందరి కళ్లూ క్షణక్షణానికీ యజ మాని గదితలుపు మీదికే పోసాగినై

సుబ్రహ్మణ్యం తన ఆఫీసుగది ఒకసారి పరీక్షించాడు. పైన లైటున్నది. టేబిలుమీద ఫా నున్నది. ఎడ చేతి పక్కగా బీరువా ఒకటున్నది. కాని అందులో ఏమీలేవు. టేబిలు డ్రాయర్సుకూడా ఖాళీగా ఉన్నై. తనకు కావ సిన వస్తువులూ, ఏర్పాట్లూ ఒక చిన్న కాగితంముక్కమీద రాసి సుబ్రహ్మణ్యం ఎకౌంటెంటును పిలిపించి అతని చేతికిచ్చాడు.

''మన ఆఫీసుకు కుర్రవా డొకడు కావాలి. నా టేబిల్‌మీద కాల్‌బెల్ కావాలి. నాకు లెటర్‌హెడ్ కాగితాలూ, విడిగా తెల్ల కాగితాలూ, పిన్నులూ, క్లిప్పులూ, మంచి ఫౌంటెన్ సిరా, బ్లాటింగ్ పేపరూ కావాలి. నా గదిలో ఇంకా రెండు కుర్చీలు కావాలి. తారీకులు చించే కాలెండరు కావాలి. గుమాస్తాలు పనిచేసే చోట వేరే ఒక గడియారం కావాలి. అది అందరికీ కనిపించేటట్టు పెట్టించండి" అని చెప్పాడు.

ఆ తరవాత అతను గుమాస్తాలు పనిచేసే చోటికి వచ్చి ఒక్కొక్కరూ ఎంతెంత కాలంనించీ పనిచేస్తున్నదీ, ఎంతెంత జీతం పుచ్చుకుంటున్నదీ, వాళ్ళకందరికీ ఎంతేసి కుటుంబాలున్నదీ విచారించాడు. అత నీవిధంగా ప్రశ్నించటం ఇద్దరికి నచ్చినట్టు కనిపించలేదు. మిగిలిన ముగ్గురూ ఉత్సా హంగానే సమాధానాలు చెప్పారు. అతను లూసీతో మాత్రం ఇవాళ ప్రత్యేకించి ఏమీ మాట్లాడలేదు.

అందరితోనూ మాట్లాడటం పూర్తికాగానే అతను మేనేజరుగారి గదికివెళ్ళి "ఏమండీ, పనిమీద ఉన్నారా ?" అన్నాడు.

"లేదు, లేదు కూర్చోండి" అన్నాడు సర్వభద్రంగారు.

"మన గుమాస్తాల జీతాలు బాగాలేవు" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"మన వ్యాపారమూ అంత బాగాలేదు. మీకు తెలిసిన విషయమే "

సుబ్రహ్మణ్యం నవ్వాడు. "మన ఆఫీసు సహకారసంఘం కాదు. మన గుమాస్తాలు అందులో మెంబర్లూ కారు. మన లాభనష్టాలు వారిని బాధించ వల సిన కారణమూ లేదు."

"మీ చిత్తం. జీతాలు పెంచమంటే క్షణంలో పెంచగలను. కాని—"

"పెంచండి. నాకుబాగా అనుభవంలేదుకాని మన గుమాస్తాలు మనమిచ్చే జీతా లతో తృప్తిపడటం నాకు చాలా అవసరంగా తోస్తున్నది. లేనిపక్షంలో వాళ్ళ కొద్ది డబ్బుల కాశించి మన రహస్యవిషయాలు ఇతరులకు సులభంగా అమ్మెయ్యగలరు. మన వ్యాపారం బాగా లేకపోవటానికి మన మిచ్చే తక్కువజీతాలే కారణ మయినా నా కాశ్చర్యంలేదు."

"మీరు చెప్పింది యుక్తిగానే ఉంది. జీతాలే లెక్కన పెంచమన్నారు ? ఎప్పటినించి పెంచమన్నారు ?"

"చెబుతాను.. ఒక గుమాస్తా—అతని పేరు కొండల్రావనుకుంటాను — అతనికి నెలకు నూరిస్తున్నాం. అతను చేసే పనిలో విశేషం యేమయినా ఉందా ?"

"అయ్యో ! అతను బియ్యేదాకా చదివాడు. మన తరఫున రిప్రెజెంటేటివుగా దొరల కంపెనీలకు వెళ్ళి మాట్లాడి రాగలవాడు. ఇటు చిల్లర అమ్మకాలు కూడా బాగా ఆర్గనైజు చెయ్యగలవాడు. అతను మన ఆఫీసుకు చాలా ముఖ్యం. అతని కేరోజున అయినా నూరూరూపాయల ఉద్యోగం సులభంగా దొరుకుతుంది."

"టూరు వెళ్ళటమూ అదీ అతనే చేస్తుంటాడా ఏమిటి ?"

"ఆహా !"

"కిందటిసారి టూరు వెళ్ళినప్పు డతడు ఏమాత్రం కొత్త ఆర్డర్లు తెచ్చాడో ఒక్కసారి చూతామా ?"

"చూడనవసరం లేదు. అయిదారు వేలకంటె తీసుకురాలేక పోయినాడు ఫీల్డు ఎంత చెడి ఉన్నదంటే, నాకదే ఘనమనిపించింది."




'సరే, అతనికి తప్ప మిగిలిన వాళ్ళందరికీ పదేసి రూపాయలు పెంచండి. స్టెనోగ్రాఫరుకూడా పది రూపాయలు పెంచండి... అన్నాట్టామెకు తగినంత పని ఉంటున్నదా ?"

"అయ్యో, లేకేం?"

"అపాటికూడా మగవాణ్ణి పెట్టకపోయినారా ?"

"ఆడ స్టెనోగ్రాఫ రుంటే గొప్పగా భావించే దొర లుంటారు చూడండి. అదీకాక చక్కని ఇంగ్లీషులో ఉత్తరాలు రాస్తుంది. మన ఇంగ్లీషు ఎట్లా అయినా—"

"పోనివ్వండి. నే చెప్పిన ప్రకారం జీతాలు పెంచండి."

"చిత్తం అందరితోపాటు కొండల్రావుకూడా—"

"అతను చాలా ముఖ్యుడంటున్నారుగనక అతని కేసు మరికొంచెం తాపీగా విచారించి అతని ఇంక్రిమెంటు మిగిలినవాటికి సంబంధం లేకుండా హెచ్చిం తాం. అతను నిజంగా ఉపయోగపడే వాడేయితే పదేమిటి, పాతిక ఇద్దాం"

ఇక సర్వభద్రంగా రనేదేమీ లేకపోయింది.

"మరోసంగతి. మనవాళ్ళ శలవు లేవిధంగా ఉంటున్నై ?"

"ముఖ్యమైన పండగల కన్నిటికీ శలవిస్తాం. వేరే శలవులు కావాలంటే వాళ్ళ అవసరాన్నీ, మన సులవూ బట్టి జీతం మినహాయించో, మినహాయించకుండానో శలవు లిస్తూ వస్తున్నాం."

"అది అంత సక్రమంగా ఉన్నట్టులేదు. ఎంత లేదనుకున్నా మన కందరి మీదా సమానమైన ఆదరం ఉండదు. శలవు లివ్వటంలో మనం అప్రయత్నంగా అన్యాయం చెయ్యటం జరుగుతుంది. అందుకని శలవుల విషయం కొన్ని నిబంధన లేర్పరచాలి. అది మనం సాధ్యమైనంత త్వరలో చేస్తే మంచిది."

''అట్లాగే చేయించండి!"

సుబ్రహ్మణ్యం లూసీని పిలిచి రెండు సర్క్యులర్లు— ఒకటి జీతాల హెచ్చింపుకు సంబంధించినదీ, ఇంకోటి శలవుల నిబంధనలకు సంబంధించినదీ--చెప్పి, వాటిని టైపుచేసి, అందరికీ చూపించమని చెప్పాడు. తనకూ, మేనేజరుకూ, ఎకౌంటెంటుకూ, ఫైలుకూ కాపీలు తియ్యమన్నాడు.

అయిదుగంటలు కాగానే అతను వెళ్ళిపోయినాడు. అతను వెళ్ళిన మరుక్షణం ఆఫీసులో వ్యాఖ్యానాలు బయల్దేరినై. ఇతను రావటంవల్ల ఆఫీసూ, వ్యాపారమూ బాగుపడే లక్షణా లున్నయ్యని ఒక డన్నాడు. ఈయనగారు ఇంగ్లండులో నేర్చుకొచ్చిన శాస్త్రమంతా ఇక్కడే వెళ్ళబెడుతున్నాడన్నాడు మరోఆయన. కొత్త బిచ్చం ఇట్లాగే ఉంటుందని మరోడన్నాడు. అందరికీ జీతాలు పెంచికొండ్రావుకు జీతం పెంచకపోవటం అన్యాయమని ఒక రన్నారు. (కొండ్రావు మేనేజరు మనిషని తెలిసి, అతనంటే భయపడుతూ అతని మంచికోసం దేబిరించే ద్రాష్టులా ఆఫీసులో ఉన్నారు) నిన్న సుబ్రహ్మణ్యాన్ని కొంతదూరం సాగనంపి అంత మంచిగా మాట్లాడిన పనీ పాటా లేని ముసలాయన "ఏమో నాయనా! ఇన్నాళ్లనించీ ఈ ఆఫీసినోటీసులూ యేవీ లేకుండానే వెళ్ళింది. ఇప్పు డివన్నీ కలిగినై. ఇదో కొత్తా!'' అన్నిరకాల అభిప్రాయాలతోనూ ఏకీభవిస్తూ అన్నాడు.

కొండ్రావుమాత్రం నోరు విప్పలేదు. కొత్త యజమాన్నిగురించి అతను అనగోరిన దంతా అందరికీ అర్థమయ్యేట్టు కళ్ళతోనే అని, సర్వభద్రంగారి గదికి వెళ్ళాడు.

"నీకేం ఫరవాలేదు కొండ్రావ్. అందరితోపాటు నీకూ పది పెంచితే చాల దన్నాను. ఆలోచిస్తా నన్నాడు. ముష్టి పదిరూపాయల పెంపకమైతే ఇవాళే నీ పేరు లిస్టులో చేర్చకపోయినానా?" అన్నాడు సర్వభద్రంగారు పెద్ద బొంకు బొంకి.

కొండ్రావు ఆగ్రహం ఉపశమించింది. అతను మేనేజరుగారి దగ్గిర శలవు పుచ్చుకుని ఇంటికి వెళ్ళాడు.

సర్వభద్రంగారు ఈ కొత్త సమస్యను గురించి తీవ్రంగా ఆలోచించాడు. ఈ భూషణానికి పాత కాగితాలుచూసే తీర్మానంఉంటే తను జాగర్తపడాలిందే. ఇతనితో ఏ వైఖరి అవలంబించాలో ఆయన కింకా తెలియలేదు. తనమీద అతని కేమాత్రం గురీ, గౌరవమూ ఉందీ తేల్చుకుంటేగాని కర్తవ్యం నిర్ణయం కాదు.

ఇవాళ అతను చేసినమార్పులు నిజానికి సర్వభద్రంగారి నంటేవి కావు. అత నిటువంటి మార్పు లెన్నిచేసినా తనకేమీ ఫరవాలేదు. కాని కేవలమూ రోగ లక్షణం అనుకుని చూస్తే ఈ మార్పులు తనకు శుభకరంగా కనిపించలేదు. ఇటువంటి పనులుచేసే తీర్మానమే ఉంటే ఈ భూషణం రేపు తనింటికి నీళ్ళు తేకుండా ఉంటాడా? అదే తేలలేదు సర్వభద్రంగారికి.

"కానీ, చూతాం! అప్పుడే ఏమయింది ? ఈ భూషణం జబ్బు ముదురు తుందని తోచినప్పుడే బ్రహ్మాస్త్రం ప్రయోగించవచ్చు" ననుకున్నా డాయన.

## 8

సుబ్రహ్మణ్యం మన స్తత్వం అంచనా కట్టటంలో సర్వభద్రంగా రేమాత్రమూ పొరపళ్లేదు. ఆనాడు తను ఆఫీసులోచేసిన మార్పులు తలుచుకున్నప్పుడల్లా అతని రొమ్ము పొంగింది ఇంతకంటె, తనుకాదు, బ్రహ్మదేవుడుకుటు కేంచెయ్య గలడు? రెండురోజులైపోయినై. తను చెయ్యగలిగిందీ అయిపోయింది. మిగతా ఇరవై యెనిమిది రోజులూ యేదోవిధంగా ముక్కు మూసుకుంటే ఆపైన భూషణంవచ్చి తన యిష్టంవచ్చినట్టు చేసుకోనీ. ఇక తన కర్తవ్యమల్లా రోజూ ఆఫీసుకు పోవటమూ, జరిగే పని తనకీచేస్తున్నట్టు నటించటమూ, ఏమన్నా పుస్తకాలుతెచ్చి చదువుకోవటమూనూ. నాలుగు మంచిమంచి పుస్తకాలు కొనుక్కుని చదువుకోవటాని కింతకంటె మంచి అవకాశం లేదు. రేపు జ్ఞాపకం పెట్టుకుని పుస్తకాల షాపులు తిరగెయ్యాలి...

పాపం, భూషణం ఏంచేస్తున్నట్టు! ఆ డబ్బు ఖర్చుచేశాడా, ఇంకా ఉందా? మూఢుడు! ఎందుకిట్లా అవస్థపడటం? ఇవాళ తనదగ్గిరికి వచ్చి "అబ్బాయీ! నీ గొడవ నాకిక చాలు, నీ అవస్థ నవు పడు, నా అవస్థ నేను పడతాను" అంటే తను కాదంటాడా?...లేక ఉద్యోగం సంపాదించాడా? సంపాదిస్తే మొనగాడే... తను మాత్రం పూర్తిగా చిత్తయిపోయినట్టే! ఎందుకంటే తను ఇక చెయ్యగలిగిందేముంది? నిజంగా ఏమీ లేదు ఈ వ్యాపారం గురించి తనకు ఓనమాలు తెలీవు. జీతాలు పెంచటానికేం? గుడ్డిముండ చేస్తుంది - ఇచ్చుకునే డబ్బు మరొకరి దయితే! అంత స్వల్పవిషయంగనక ఆ సర్వభద్రం ఏమీ అనలేదుగాని,

ఇదే తను వ్యాపారసంబంధంలో జోక్యం కలిగించుకుంటే సర్వభద్రం అప్పుడే చెప్పేటి తీసుకునేవాడు—ఒకవేళ తను చెయ్యగలిగిందేమన్నా ఉందేమో! అదీ అంత సూక్ష్మవిషయం కాదేమో! తను కొంచెం ఆలోచిస్తే తెలిసే అంశమేనేమో! ఒకవేళ తను చెయ్యగలిగిందే అయితే చెయ్యకుండా ఉండటం భూషణానికి ద్రోహం కాదా?

ఎందుకు ద్రోహం? తనవంతు పని తను సరిగాచేస్తే బాగుపడేది భూషణం. అతనివంతు పని తను చేస్తే తన కేమిటిలాభం? ఏమీలేదు భూషణం తనను మోసంచేశాడు! అక్షరాలా మోసంచేశాడు!

కాని మరుక్షణమే సుబ్రహ్మణ్యానికి పశ్చాత్తాపం కలిగింది. తనపని తాను చేసినా చెయ్యకపోయినా లాభమేకదా! భూషణం తన డబ్బూ, వ్యాపారమూ పత్రంముక్క లేకుండా తనకు వప్పగించాడే; ఇంతకంటే అతనుగాని, ఇంకోరు గాని తన కేంచెయ్యగలరు? "నా తొందర క్షమించు, భూషణం!" అని వేడు కున్నాడు సుబ్రహ్మణ్యం.

అత నట్లా అదివర కెవ్వరినీ మనస్సులో చేసిన తప్పుకు మనస్సులో క్షమా పణ వేడుకోలేదు, ఎంతసేపటికీ మనుషులమీద కత్తికట్టి తిరిగాడుగాని. "నే నప్పుడే బూర్జువా నయిపోయినాను—అయినా నాలో మానవత్వం హెచ్చింది గాని తగ్గలేదు." అనుకున్నా డతను.


మర్నా డతను ఆఫీసుకు టైమ్‌కు వెళ్ళలేదు. పుస్తకాల షాపుకు వెళ్లి, 'సైకాలజీ అఫ్ వెల్త్' అనే పుస్తకం కొని మరీ వెళ్ళాడు. తన బల్లమీదకు బెల్ వచ్చింది డ్రాయర్‌లో తను కోరిన సామానంతా ఉంది. అదంతా తను ఎందు కడిగిందీ తనకే తెలీదు. అతను నిశ్చింతగా కుర్చీలో కూర్చుని కొన్న పుస్తకం చదవసాగాడు...

"భూషణ్!"

ఆ పిలుపు సుబ్రహ్మణ్యం చెవిన పడింది కాని అతన్ని పుస్తకం ప్రపంచంలో నించి లేపలేకపోయింది.

మళ్ళీ—"భూషణ్ గారూ!"

ఉలిక్కిపడి సుబ్రహ్మణ్యంతలఎత్తి, అప్రయత్నంగా కుర్చీలోనించి చూశాడు. స్ప్రింగ్ తలుపు వొకచేత్తొ పట్టుకుని, ఇరవై యేళ్ళ ప్రాంతాల వయసుగల అమ్మాయి తనకేసి చిరునవ్వుతో చూస్తూ నిలబడిఉంది. సుబ్రహ్మణ్యం బెదరి




పోతున్న తన ఆలోచనలను బిగలాక్కున్నాడు. ఆమె సుశీల కాదుకదా! కొంప తీసి తనను పట్టేస్తుందా?

"సుశీల!" అన్నాడతను, తనతో తను చెప్పుకుంటున్నట్లుగా.

"అవును, సుశీల" అంటూ లోపలికొచ్చిందామె.

"గుర్తుపట్టరాకుండా ఎట్లా మారిపోయావు, భూషణ్!"

"నిజంగానా?"

"నేనూ మారి ఉంటాను. నిజంచెప్పు. నన్ను గుర్తించలేదు కాదూ?"

"నువ్వేమీ మారలేదు, నిన్న చూసి నట్టున్నావు?" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"చూడు నీ గొంతెట్లా మారిందో!—నన్ను చూడటం నీకు సంతోషంగా లేనట్టుంది, భూషణ్?"

"చాలా సంతోషంగా ఉంది" అన్నాడు సుబ్రహ్మణ్యం, చిరునవ్వు నవ్వటానికైనా ప్రయత్నించకుండా. అతని గుండెల దడ ఏమాత్రమూ తగ్గేటట్టులేదు!

"ఏమో, సంతోషం నీ మొహంలో గాని, కళ్ళల్లో గాని ఏమీ కనిపించటం లేదు!"

"కూర్చో, సుశీలా," అన్నాడు సుబ్రహ్మణ్యం తన స్తబ్ధతను వదిలించుకోవనికి ప్రయత్నిస్తూ.

"సున్!" అన్న దామె నవ్వుతూ.

"ఏమిటీ?" అన్నాడతను, అర్థంకాక.

"సుశీల కాదు, సుస్. మై డియరెస్ట్ సుస్!"

ఒక్కక్షణం ఆలోచిస్తేగాని ఆమెధోరణి అతనికి అర్థంకాలేదు. భూషణం ఆమె కట్లా ఉత్తరాలు రాశాడేమో ఖర్మం!

"ఆల్ రైట్! సుస్—మైడియరెస్ట్!" అన్నాడతను, ఇంతసేపటికి ఒక చిరునవ్వు నవ్వటానికి సాహసించి.

సుశీల కుర్చీలో కూర్చున్నది. ఆమె కిప్పటికీ సంపూర్ణమైన తృప్తి కలగ లేదు గాని, మొదటికన్న కాస్త నయం.

"నువు నిజంగా చాలా మారావు భూషణ్!"

"ఏ విధంగా?"

"ఫలాని విధంగా అని చెప్పలేను. అన్ని విధాలా! పరధ్యానంగా ఉన్నావు. లోపలేదో నిన్ను బాధిస్తున్నట్లు కనిపిస్తున్నావు."

"అసలుమాట అనేసెయ్. మరోమనిషల్లే ఉన్నాను—అవునా."

"రామరామ! నేనంత టెంపరమెంటల్ మనిషిని కాను, భూషణ్. నువ్వే మైనా కష్టంలో ఉన్నావేమోనని జాలిపడుతున్నాను గాని మారిపోయినావని తప్పుపడతానా?"

"థాంక్స్, సు-సుస్! మరేం లేదుగాని ఈ వ్యాపారం నా కేమీ తోచకుండా చేస్తున్నది."

"హాయిగా కూచుని ఏదో పుస్తకం చూస్తున్నావు. ఏమిటా పుస్తకం?"

"సైకాలజీ ఆఫ్ వెల్త్."

"అది చదివి ఆత్మపరీక్ష చేసుకుంటున్నావా ఏమిటి?"

ఇద్దరూ నవ్వారు.

"నీతో ఎంతో ముఖ్యమైన విషయాలు మాట్లాడాలి. నువ్వుండే చోటికి పోదాం పద! నువ్వొచ్చి మూడురోజులై కూడా నన్ను చూట్టానికి రాలేదు కాదూ? నేను రాకపోతే ఎంతకాలం రాకుండా ఉండేవాడివో?"

"నీకు పరీక్ష లనుకున్నాను. సరే నేనువచ్చి మూడురోజులైందని ఎవరు చెప్పారూ?"

"ఎవరో చెప్పందే నిన్ను వెతుక్కుంటూ ఎలా వచ్చానూ? నా పరీక్ష లయి నట్లు సర్వభద్రంగారు నీకు చెప్పారుటగా?"

"ఆయనే నా విషయం చెప్పాడన్నమాట."

సుశీలను పంపకంచేస్తే కుర్రవాడు ఆఫీసుగొడవ మానేస్తాడనే దివ్యమైన ఆలోచన సర్వభద్రంగారికి కిందటి సాయంకాలం ఇంటికి పోతుండగా తట్టింది.

'ఇంతకూ నీ బస ఎక్కడ?"

"దగ్గిరే, హోటల్లో."

"మా యింటికి రాలేదేం?"

"హోటలు ఆఫీసుకు దగ్గిరగా ఉంటుందని."

"నువు చెప్పే వంకలు పైకెంత సరిగా ఉన్నయ్యో అంత నమ్మరానివిగా ఉన్నై."

"నన్నట్లా నిలవేస్తే చచ్చిపోనా? దయచేసి ఒక్కపని చెయ్యలేవూ?"

"ఏమిటది?"

"నన్ను గురించి నీకు కలిగే అనుమానాలన్నిటినీ ఒక నెలపాటు వాయిదా వెయ్యలేవూ? నా విషయం నీకేది విపరీతంగా కనిపించినా అందు కేదో కారణం ఉందనుకో. ఆ పని చేస్తావా?"

"ఆ కారణం నాకు విరుద్ధం కానిదైతే అట్లాగే అనుకుంటాను."

"నీకవి విరుద్ధం కాదు. నాకే విరుద్ధం."

"నా కామూక్క అర్థం కావటం లేదు."

"ఇంకో నెల కర్థ మవుతుంది."

సుశీల తనలో కలుగుతున్న ఆందోళన కప్పిపుచ్చటానికి నవ్వి "మరి పోదాం పద!" అంటూ అతని చేతికోసం చెయ్యిచాచింది. విధిగా ఆమె చెయ్యి పట్టుకుని అతను కుర్చీలోనించి లేచాడు.

సుశీల అతని చెయ్యి ఆపేక్షగా అదిమి "ఏమైనాకానీ, నేనెప్పుడూ నీపక్షమే భూషణ్. నువ్వెంత తప్పుచేసినా నేను నిన్ను గురించి అభిప్రాయం మార్చు కోను" అన్నది.

సుబ్రహ్మణ్యం దీనంగా, "భూషణ్ కంటె ప్రపంచంలో అదృష్టవంతు డెవడు!" అన్నాడు.

## 9

ఇద్దరూ హోటల్‌గదికి చేరుకున్నారు. సుబ్రహ్మణ్యం రెండు కప్పులు కాఫీ ఆర్డరు చేశాడు.

"వ్యాపారం చిక్కులన్నావేమిటి ?" అన్నది సుశీల వొక కుర్చీలో కూల బడుతూ.

"వ్యాపారం ఏమీ బాగాలేదు."

"అసలు వ్యాపారమే బాగాలేదు. అంతా అంతంత మాత్రంగానే ఉన్నారను కుంటాను."

"కావచ్చు. కాని ప్రత్యేకించి మన వ్యాపారంలో ఏదో పురుగు పుట్టింది. సర్వభద్రం ఎటువంటి మనిషి ?"

"మంచివాడే ననుకుంటా. కనపడ్డప్పుడు సరదాగా మాట్లాడతాడు - ఏం ?"

"ఏమీలేదు. ఊరికేనే అడిగాను."

"ఆయన నిన్నసాయంకాలం మా యింటి కొచ్చాడు నువ్వొచ్చావని చెప్పాడు చెప్పి, 'భూషణం కుర్రవాడు. ఈ వయసులో మీవంటివాళ్ళు సరదాగా ఉండాలిగాని, అతని మాదిరిగా వ్యాపారచింతలో మునిగిపోవటం భావ్యంకాదు' అని వెళ్లాడు."

సుబ్రహ్మణ్యంలో కలిగిన ఆందోళన ఆమె కర్థం కాలేదు ఆమె ఆ మాట చెప్పగానే అతను తేలుకుట్టిన వాడల్లే అయి, "గుడ్ గాడ్ !" అని అటూ ఇటూ తిరగసాగాడు.

అసలే ముళ్ళమీద ఉన్నట్టున్న సుశీలకు అతనిచర్య చూసి కోపం కూడా వచ్చింది. "ఎందుకు భూషణ్ ? ఏమిటంత ఖంగారు ?"

"ఆ సర్వభద్రం నన్నాఫీసుకు రాకుండా చెయ్యాలని చూస్తున్నాడు, తెలీటం లేదా ? దేనికి ? దేనికి ? అదే నాకిప్పుడు తెలియాలి !"

"నువు నిజంగా మారిపోయినావు, భూషణ్ ! నీ కింత తాపత్రయం లేదు వెనుక. ఇంత ఇన్ఫీరియారిటీకూడా లేదు. నిన్నెవరో మోసం చెయ్యాలని ప్రయత్నిస్తున్నారని ఇంత బెంగ దేనికి ? నీ నిబ్బరమంతా ఏమైపోయిందీ ? గుడ్ హెవెన్స్ ! నిన్నాఫీసుకు రాకుండా చెయ్యాలని ప్రయత్నించాడనే అనుమానంతో ఆయన్నింత సందేహించేవాడివి, ఆఫీసునించి బయల్దేర దీసినందుకు నన్నేం సందేహిస్తున్నావో !"

సుబ్రహ్మణ్యం అవాచ్యమైన స్థితిలో పడ్డాడు.

"సుశీ ! నేను నిన్ను బతిమాలుకుంటాను. ఒక్కనెలపాటు నన్ను గురించి ఏమీ అనుకోకు. నే చేసేదీ, అనేదీ గమనించకు" అని అతనామెను వేడుకున్నాడు.

సుశీలకు పశ్చాత్తాపం కలిగింది. ఆమె లేచి అతని చెయ్యిపట్టుకుని "టెరిబ్లీ సారీ, భూషణ్! నావల్ల అయ్యే సహాయం ఏమన్నా ఉంటేమాత్రం తప్పకుండా అడుగు. ఏమిటి, ఎందుకు, అని అడక్కుండా చేసేస్తాను... నవ్వేల కడుగుతున్నాను! నువు దేశాలమీద తిరిగినప్పు డేంచేసి వచ్చావు?"

"ఏం చెయ్యలేదు, సుశీ! ప్రమాణపూర్తిగా ఏమీ చెయ్యలేదు."

"థాంక్స్! ఈ గొడవలో అసలువిషయం చెప్పటం మరిచిపోయినాను. కూర్చుందాం... మా నాన్న నన్ను 'రావుబహదూరుగా రబ్బాయిని చేసుకోరాదా' అని అంటూ వస్తున్నాడు. నువు రాగానే చెప్పుదామని ఉత్తరంలో కూడా రాయలేదు."

"ఆయన కా బుద్ధెందుకు పుట్టిందీ?" అన్నాడు సుబ్రహ్మణ్యం, రావుబహదూ రెవరో తెలియకుండానే.

సుశీల నవ్వింది. "మా నాన్న చిత్రమైన మనిషి. నా పెళ్ళిలో ఆయన కొంత వెస్టెడ్ ఇంటరెస్టు తెచ్చి పెట్టుకున్నాడు. మీ నాన్నగారు బతికుండగా మనిద్దరికీ పెళ్ళి కావాలని ఎందు కుబలాట పడ్డాడంటే, నా మాట ఏమైనా తను మీనాన్నంత గొప్ప వియ్యంకుణ్ణి పెళ్ళాడెయ్యొచ్చు గదా అని. ఇప్పుడు మీనాన్న లేడుగా, అందుకని ఆయనమోజు రావుబహదూర్‌గారి మీద పోతున్నది" అన్నది.

ఈ సుశీల ఏమాటచెప్పినా అది సుబ్రహ్మణ్యం గొంతుమీదికే వస్తున్నది. తరవాత సుశీల భూషణాన్ని పెళ్ళాడనీ మాననీ, తను భూషణం పదవిలో ఉండగా భూషణానికీ, ఈ సుశీలకూ ఉన్న బాంధవ్యంలో ఎటువంటి ప్రమాద కరమైన మార్పూ రాకుండా చూసేభారం తనమీద ఉంది.

"అట్లా ఎన్నటికీ జరగటానికి వీల్లేదు. నాకు నిన్నివ్వకపోతే మీ యింటి కప్పు పీకేస్తాను. మీ యింటిముందు నాలుగు మోటార్లు తెచ్చిపెట్టి విడవకుండా నాలుగుహారన్లూ మోగిస్తాను!" అన్నాడతను గందరగోళంగా.

సుశీల విరగబడి నవ్వింది.

"అంత ప్రమాదం దేనికి, భూషణ్! మా నాన్న లక్ష చెయ్యాలనుకోనీ గాక, నా యిష్టం లేకుండా చెయ్యగలడా? ఊరికే ఆయన మనస్సులో ఉన్న ఉద్దేశం చెప్పాను." ఆమె భూషణం ఇన్ఫీరియారిటీ ఇందులో కూడా గమనించింది గాని దాన్ని గురించి అనదలచలేదు.

"మా యింటికి పోదాం పద. నిన్ను చూడగానే మా నాన్న ఎటువంటి మొహం పెడతాడో చూడాలి" అన్నదామె.

ఇద్దరూ కలిసి సుశీల ఇంటికి వెళ్ళారు.

"ఇడుగో నాన్నా, భూషణ్. మన పెళ్ళెప్పుడంటున్నాడు. నిన్నడిగి చెబుతా నన్నాను" అన్నది సుశీల, తండ్రికి సుబ్రహ్మణ్యాన్ని చూపించి.

"పెళ్లా? ఏం పెళ్ళి?" అన్నాడు సుశీలతండ్రి. వెంటనే సుబ్రహ్మణ్యానికి ఆయన తత్వం అర్థమైపోయింది. ప్రతివిషయమూ మూడు ప్రశ్నలు వేసి మూడుసార్లు చెప్పించుకుంటేకాని అర్థంకాదు. వాళ్ల బుద్ధి పెళ్ళినడకలవంటి మందగమనం గలది. వీళ్లు భాగ్యవంతులుగనక బతకగల్రు. ఇటువంటివాడు పాటకపుజనంలో ఉంటే వాడికిన్ని మెతుకులుకూడా పుట్టవు. వీళ్ల గొప్పవాళ్ళు గనక, ఇతరులు వీళ్ళతో ఓర్పుగలిగి మాట్లాడతారు గనక, వీళ్ళు తమతమ వాతావరణంలో బతకగలుగుతారు. సుశీల తన చేతిలోఉన్న సంచీ ముసలాడి బట్టతలమీద కొట్టక, పెళ్ళంటే యేమిటో వివరించిచెప్పటం చూస్తే సుబ్రహ్మ ణ్యాని కాశ్చర్యం వేసింది. వాళ్ళిద్దరి సంభాషణకూ అతను పెడచెవి బెట్టాడు. సుశీలతండ్రి "చూదాంలే... దానికేం!" అనటం మాత్రం అతని చెవిన బడ్డది.

సుశీల సుబ్రహ్మణ్యానికి ఆమధ్య తను తీయించుకున్న ఫోటోలన్నీ చూపించింది. సుశీలకు జీవితంలో ఇవన్నీ ముఖ్యమైన విషయాలుగా తోచటం అతనికి నచ్చలేదు.

"కాస్సేపు ఫిడేలు వాయించనా భూషణ్? నేను ఫిడేలు వాయించటం నువ్వెప్పుడూ విన్లేదు" అన్నది సుశీల.

"వాయించు. నాకు సంగీతమంటే చెడ్డ అభిరుచి కలిగింది ఈ మధ్య."

"ఈ మధ్య కలగటం యేమిటి? నీ కెప్పుళ్ళేదు? నువు పాడతావుకూడానూ, యేదీ కాస్సేపు పాడు, భూషణ్"

"నా పాటంతా చిన్నతనంలోనే పోయింది. యేదీ నీ ఫిడేలుతీసి వాయించవేం?"

సుశీల ఫిడేలు తీసి శ్రుతిచేసి వాయిస్తూ ఒక కృతి పాడింది.

"ఫిడేలు కో ఛాన్సివ్వు, సుస్. పాట్టం మొదలుపెట్టి దాని కడ్డం రాకు" అన్నాడు సుబ్రహ్మణ్యం మృదువుగా.

సుశీల మరోకృతి ఊరికే వాయించింది. సుబ్రహ్మణ్యం తల అడ్డంగా తిప్పి "లాభంలేదు సుస్, ఫిడే లెవరికన్నా అమ్మేసెయ్యి!" అన్నాడు.

"అమ్మో! మనిషినెంత ఉబ్బెయ్యగలవు భూషణ్!" అన్నది సుశీల నవ్వుతూ.

"అవును, సుస్! మనస్సు నొప్పించటమంటే నాకెంతో భయం."

"అయితే మనం యేదన్నా సినిమాకో, షికారుకో పోదామా?"...



అతను సుశీలదగ్గర శలవుపుచ్చుకొని తన హోటలుగదికి వచ్చేటప్పటికి రాత్రి తొమ్మిదయింది. సుశీల అతని మనస్సులో పీట వేసుక్కూచుంది. ఆమెను చూసి అతను ముగ్ధుడు కాలేదు. ఆమె అతని ఆలోచనలను పొగ చుట్టేసినట్టు చుట్టెయ్యలేదు. ఆమెకోసం అతని ప్రతినరమూ పీకలేదు. కాని ఆమె అతని సానుభూతిని సంపాదించింది. ఆమెలో ఉన్న లోపాలేవో అతని కప్పుడే తెలిసిపోయినై. అందులో సరిచెయ్యరాని లోపాలేమీ లేవు. ఆమె హృదయంలో కల్మషం ఏమీ లేదు. చిత్రం, అంత డబ్బుండి ఆమె ఇంకోమనిషిని స్వార్థం ఏమీ లేకుండా ప్రేమించగలదు. ఇంకోర్ని గురించిన ఆలోచనలోపడి తన్నుతాను మరిచిపోగలదు! అయినప్పటికీ అమాయకురాలుగాని, వెర్రిబాగులది కాని కాదు.

ఆమె మొదటిసారి తనచెయ్యి పట్టుకున్నప్పుడు సుబ్రహ్మణ్యానికి కష్టం వేసింది - ఆ స్పర్శ న్యాయంగా భూషణానికి చెందవలసిందని కాని త్వరలోనే ఆ అనుమానం రహితమయింది. ఆమె భూషణాన్నీ ఎరగదు. తననీ ఎరగదు. ఎరిగుంటే తను భూషణం కాదని కనుక్కునేదే! ఆమె తనను ప్రేమించటంలో ఆమె ప్రత్యేకతేగాని తన ప్రత్యేకత ఏమీ లేదు. ఆమె హృదయంలోనించి వచ్చే ఈ ప్రేమమీద ఎవరు ముద్ర వేసుకోగలిగితే అది వారిదై పోతుంది. సుశీల ప్రేమను శాశ్వతంగా తన సొంతం చేసుకోవాలని సుబ్రహ్మణ్యం తీర్మానించు కున్నాడు.

## 10

సుబ్రహ్మణ్యానికి ఆత్మవిశ్వాసం హెచ్చుకాసాగింది. ఒకచెంప సర్వభద్రం తనను ఆఫీసుకు రాకుండాచెయ్యాలని చూస్తున్నాడు. అంటే తను ఆఫీసుకు రావటంవల్ల బయటపడే గుట్టేదో ఉందన్నమాట. దొంగముండాకొడుకు! వ్యాపారాన్ని ఏవిధంగానో ఒక కొలిక్కి తెస్తున్నాడు. తనకు తీర్మానమే ఉండాలిగాని దొంగ దొరక్కపోడు. ఈ పని తన కసాధ్యమనుకుని బెదరనవసరంలేదు... పోతే, సుశీల తనను గుర్తించలేదు. తనకు తాను గుర్తించలేదు కూడానూ. తన వ్యక్తిత్వం ఆమెకు అసహ్యంగాని, కోపంగాని తెప్పించలేదు. ఆమె అపేక్ష సంపాదించటానికి తను ఎంత కృషి అయినా చెయ్యటానికి సిద్ధంగా ఉన్నాడు. ఈ నాలుగువారాలూ తను తన శక్తియావత్తూ వినియోగిస్తే, ఆ తరవాత తను భూషణం కాదని తెలియగానే ఆ ప్రేమను సుశీల ఉపసంహరించుకుంటుందా? ఇదంతా భూషణంమీదికి తిప్పగలుగుతుందా? వట్టిది! 'ఆమె ప్రేమకు నీ అర్హత ఏమీలే' దంటే భూషణం అర్థంచేసుకోలేకపోతాడా?

మర్నాడు అతను ఆఫీసుకు వెళ్ళి జరుగుతున్న వ్యాపారం గురించి సమస్త వివరాలూ తెలుసుకోవటానికి తీర్మానించుకున్నాడు. కనీసం గడిచిన సంవత్సరం కాలంలోనూ ఆఫీసుకయిన జమాఖర్చుల తాలూకు అన్ని వివరాలూ తెలుసు కోవాలి. అన్ని ఆఫీసురికార్డులూ, ఫైల్సూ, కూర్చుని పారాయణ ప్రారంభించాలి. వీలయితే సుశీల సహాయంకూడా తీసుకోవాలి. సాధ్యమైనంతవరకు సర్వభద్రానికి తన లోతు చిక్కకుండా చూసుకోవటం మంచిది. అమాయకుడల్లే నటించటం ప్రయోజనకారి.

అంతా బాగానేఉంది. కాని అసలు చిక్కంతా సుశీలబుద్ధి ఈ వ్యాపార సమస్యమీదికి తిప్పటంలో ఉంది. దానికోసం ముందు కృషిచెయ్యాలి. ఆమెతో

మాట్లాడాలని అనుకుంటుండగా హోటలు కుర్రవాడు వచ్చి టెలిఫోనుమీద ఎవరో పిలుస్తున్నారన్నాడు. సుబ్రహ్మణ్యం వెళ్ళిచూస్తే సుశీల.

"హలో, భూషణ్ !"

"హలో, సుస్ !"

"నీతో ఒక మంచి రహస్యం చెప్పాలి. వెంటనే బయల్దేరి వస్తావా ? నీకోసం భలే కాఫీ ఎదురుచూస్తున్నది."

"అంతకన్న ముఖ్యమైన వాళ్లెవరో ఎదురుచూస్తున్నా రనుకున్నానే ! ఇప్పుడే బయల్దేరుతున్నాను.".

అతను అక్కడికి చేరుకునేటప్పటికి సుశీల గంధర్వస్త్రీ కన్న అందంగా తయారై కనిపించింది

"ఎంత అందంగా ఉన్నావు సుస్ ! ఇంత షోకు చేసుకొని మగముండాకొడుకుల కంటపడటం ఎంత పాతకమో ఆలోచించావా ?" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"ఇక నీకోసం ఇంకా అందంగా ఉండబోతున్నాను, భూషణ్. అదే నేను చెప్పబోతున్న రహస్యం. నేను రాత్రి పన్నెండింటిదాకా నిన్నుగురించే ఆలోచిస్తూ మేలుకున్నాను. అదివరకల్లా నువ్వంటే ఏదో విపరీతమైన అభిమానమే గాని నీకోసం కలవరపడి ఎరగను. నువు వెళ్ళిపోయిన తరవాత నాకేదో కలవరం బయల్దేరింది. నా పక్కన ఉండాల్సిన మనిషి ఎడంగా పోయినట్టయింది భూషణ్. దానికితోడు నువు నాకు దక్కవని ఏదో భయంకూడా పట్టుకుంది. నువు ప్రతిదానికీ నెల గడువుపెడుతూ వచ్చావు. అదేమిటో అర్థం చేసుకుందామని ప్రయత్నం చేసినకొద్దీ భయం పుట్టుకొచ్చింది - ఈ నెల కాగానే నాకు అందకుండా పోతావని... నువ్వన్నది అబద్ధం కాదు భూషణ్ నిన్నటివరకూ నిన్ను నిజంగా ఎరగను. నీ దగ్గిర్నించి ఉత్తరం వచ్చినప్పుడూ, ఇంకే కారణంవల్ల నన్నా నువు జ్ఞాపకం వచ్చినప్పుడూ, నిన్ను గురించి ఏవేవో జ్ఞాపకం చేసుకుని నీకూ నాకూ మధ్య అవి పెద్ద బంధాలనుకునేదాన్ని. గాని నిన్నరాత్రి నువు వెళ్ళింతరవాత అవి ఒక్కటికూడా జ్ఞాపకానికి రాలేదు. నిన్ను మళ్ళీ చూడగానే వాటికేమీ 'వాల్యూ' లేకుండా పోయింది...నువు నన్నుతప్ప ఇంకో ఆడదానికేసి చూడకుండా ఉండటాని కేం చెయ్యమన్నావు భూషణ్ ?"

"థాంక్స్, సుశీ ! నిన్ను నేను మరిచిపొయ్యేటట్టు చెయ్యాలిసొచ్చినప్పు డేమన్నా చేతువుగాని, కాని అందాకా ఏమీ చెయ్యక్కర్లేదు" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"నువు కాస్త మనస్ఫూర్తిగా మాట్లాడినప్పుడల్లా నిన్ను చూస్తే నా గుండె కరిగిపోతున్నది. నీ తప్పులన్నీ క్షమించా లనిపిస్తున్నది. కాని నువు చేసిన తప్పేమీ లేదాయెను!"

సుబ్రహ్మణ్యం నవ్వాడు. "మానవమాత్రుణ్ణి! నావల్ల తప్పు కలక్కుండా ఉంటుందా? నావల్ల ఏమీ తప్పులేదనే ధైర్యంమీద నీ గుండె రాయి చేసుకోకు. నన్నుచూసి నువు జాలిపడాలిసిన అవసరం ఏక్షణాన కలిగినా కలగవచ్చు" అన్నాడు.

"నాకు భగవంతుడిచ్చిన జాలి యావత్తూ ఎప్పటికైనా నీదే! కావలిస్తే చేతిలో చెయ్యేస్తాను!"

సుబ్రహ్మణ్యం సుశీలచేయి రెండుచేతులా స్వీకరించి, "కాఫీ ఏదీ?" అన్నాడు.

కాఫీ తాగుతూ సుశీల, "అయితే మన పెళ్ళెప్పుడు?" అన్నది.

"అదికూడా మిగిలినవాటితోపాటు ఒక నెలరోజులకు వాయిదా వేద్దాం!" అన్నాడు సుబ్రహ్మణ్యం

సుశీల తాగబోతున్న కాఫీకప్పు కిందికి దించి "నా అనుమానం నిజం చేస్తావా, భూషణ్. నెలా జరగనిచ్చి నా కందకుండా పోతావా?" అన్నది గంభీరంగా.

"లేదు, సుస్. నువు పొమ్మంటేగాని పోను."

సుశీల కాస్సేపు ఆలోచించి, "పొమ్మన నని నా దగ్గర్నుంచి మాట తీసుకోవా!" అని అడిగింది.

"ఏం విచిత్రమైన మనిషిని. నాకు మాటలోకన్న మనిషిలో నమ్మకం జాస్తి."


"ఆ మాటకు నేను నొచ్చుకోనా, సంతోషించనా?"

"ప్రతి స్వల్పవిషయానికి నన్నెంత అగ్నిపరీక్షలో పెడుతున్నావు, సుస్!"

"న్యాయం చెప్పు, భూషణ్. ఇందులో నా తప్పేముంది? నీ నోట వచ్చే మాటలన్నీ ఎంత అనుమానాస్పదంగా ఉన్నై! వాటిని నేను పాటించకుండా ఆమోదిస్తే, 'పిచ్చిముండ! ప్రేమవల్ల దీనికి తెలివితేటలు శూన్యమైనై' అనుకోవా? కాస్త అభిమానంగల మనిషి అగ్నిపరీక్ష పెట్టకుండా తన ప్రేమ కాస్తా ఇచ్చేసి ఊరుకుంటుందా? న్యాయం చెప్పు!"

"వీటన్నిటినీ ఒక్క నెల వాయిదా వెయ్యమంటే వినవు!"

"నా ఆపేక్షను నెలరోజులు వాయిదా వెయ్యమంటావా, భూషణ్?"




"నా కభ్యంతరం లేదు. ఈలోపల మనకు రెండుచేతులా పని ఉంది!" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"ఏమిటది?"

"మన మిద్దరమూ ప్రతిరోజూ రాత్రిపూట మా ఆఫీసులో కూచుని పాత రికార్డులన్నీ తిరగవెయ్యటం. నేనొక్కణ్ణే చెయ్యగల ననుకో. కాని ఆలస్యం అవుతుంది. నాకు నిరుత్సాహమూ కలగొచ్చు."

"ఆఫీసులో ఏదో దగా జరుగుతున్నదనీ, నీకు రావలసిన లాభాలు రావటం లేదనీ నీకు నిజంగా సందేహమే?"

"నువ్వంత సానుభూతి లేకుండా మాట్లాడితే ఎట్లా చెప్పు! లాభాల ప్రమేయం ఏమీ లేదు. ఆఫీసులో ఏదో మోసం జరుగుతున్నదని నాకు చూసినట్టు తెలుసు. అటువంటి మోసం బయటికన్నా లాగాలి, లేదా మోసం జరగటం లేదనన్నా రుజువుచేసుకోవాలి. ఇది డబ్బుగురించిన విషయం కాదు సుస్. మానుషానికి సంబంధించిన విషయం. దానికోసమే నెల గడువు. నేను డబ్బు కోసం దేవులాట్టం లేదని ఆ తరవాత నీకే తెలుస్తుంది."

"అయితే ఈ డిటెక్టివుపని ఎప్పణ్ణించి ప్రారంభింతాం?"

"నా కిష్టమే."

"అయితే ఇవాళే ఆఫీసు తాళంచెవులన్నీ నా స్వాధీనం చేసుకుంటాను."

* * *

ఆరోజు ఆఫీసుకు వెళ్ళుతూనే ఆఫీసుతాళాల డూప్లికేట్లన్నీ సుబ్రహ్మణ్యం తన స్వాధీనం చేసుకున్నాడు. ఈ పని చెయ్యటానికి అతను సర్వభద్రంతో ఒక చిన్న వాగ్యుద్ధం జరపవలసి వచ్చింది. తను తాళంచెవులు స్వాధీనం చేసుకోవటం మట్టుకు ఆయన కిష్టంలేదని తేలిపోయింది. ఆయన కిష్టంలేనిపని ఏది చేసినా తను ఆఫీసుగుట్టు కనుక్కునే రాస్తాలో ఉన్నట్టే ననుకున్నాడు సుబ్రహ్మణ్యం.

కాని ఆ సాయంకాలమే దురదృష్టవశాత్తు సర్వభద్రానికీ, సుబ్రహ్మణ్యానికీ మరో ఘర్షణకూడా వచ్చింది.

సుబ్రహ్మణ్యం తన సంపూర్ణమైన అంగీకారం లేకుండా ఆఫీసు తాళంచెవు లన్నీ స్వాధీనంచేసుకున్నాడన్న కోపంయావత్తూ మేనేజరుగారు ఒక గుమాస్తా మీద చూపించాడు. ఆ గుమాస్తాను ఏదోపనిమీద తన గదిలోకి పిలిచి వాడిమీద విరుచుకుపడ్డాడు. వాణ్ణి అడ్డమైన తిట్లూ తిట్టాడు. ఆ మాటలు వింటున్న సుబ్రహ్మణ్యానికే గుండెల్లో రైళ్ళు పరిగెత్తినై! ఇక మిగిలిన గుమాస్తాల కెట్లా ఉండాలో అత నూహించలేకపోయినాడు. సర్వభద్రం ప్రవర్తన అతనికి కష్టమే వేసిందికాని క్రమంగా అది కోపంగా పరిణమించింది. సర్వభద్రం అహంకారానికి సంతృప్తి అనేది కనిపించలేదు. ఆయన ఇంకా అరుస్తూ ఉన్నాడు.

సుబ్రహ్మణ్యం చివాల్న కుర్చీలోనించి లేచి మేనేజరు గదిలోకి వెళ్లాడు. సుబ్రహ్మణ్యాన్ని చూసికూడా సర్వభద్రం కాస్త తగ్గలేదు. సుబ్రహ్మణ్యం ముందుకువచ్చి తిట్లు తింటున్న గుమాస్తాతో "నువు వెళ్లు" అన్నాడు.

గుమాస్తా వెళ్ళిపోయాడు.

సుబ్రహ్మణ్యం ఎంతో నిగ్రహం తెచ్చిపెట్టుకున్నాడు. అతను తాపీగా తన జేబులోనించి కలం తీసి మేనేజరుకిచ్చి, "ఆ గుమాస్తాకు ఒక క్షమాపణ పత్రం రాయండి" అన్నాడు.

సర్వభద్రంగారి మొహం కందింది. పెదిమలు వణికినై. కోపంతో మాట్లాడలేకుండా ఆయన, "ఏమిటి మీ ఉద్దేశం?" అన్నాడు.

"ఇది ఆఫీసు. మునిసిపాలిటీవాళ్ల శానిటరీ డిపార్టుమెంటు కాదు. అతన్ని తిట్టటానికీ, అతనిమీద అరవటానికీ మీ కెవరు హక్కిచ్చారు? అతనిచేత పని చేయించుకునే వరకే మీ కధికారం. అతను పనిచెయ్యలేనివాడైతే పంపించె

య్యండి. సరుకులు చౌకగాకొని ప్రియంగా అమ్మే ఆఫీసులో ఉద్రేకాల కవకాశం లేదు. వెంటనే అతనికి క్షమాపణ రాసి సంతకంచేసి ఇవ్వండి.''

"మీరు నన్ను క్షమాపణ కోరమని అడగటం అమానుషం'' అన్నాడు సర్వభద్రం.

''మీరు నాకు మానవత్వంగురించి బోధించటం కొంచెం హాస్యాస్పదంగా ఉంది.''

సుబ్రహ్మణ్యం క్షమాపణ యావత్తూ తనే రాసి, "సంతకం చెయ్యండి!" అన్నాడు.

''నేను చెయ్యను మీరు మీ యజమానిగౌరవం అతిక్రమిస్తున్నారు."

"మీరు సంతకం చేసితీరాలంటున్నాను. వినపడిందా? —యజమానిగా కాదు, రెండుకాళ్ల పశువుగా అడుగుతున్నాను."

''క్షమించండి. ఈ పరిస్థితుల్లో నే నీ ఆఫీసు బాధ్యత వహించలేను.''

''సంతోషం. అట్లా ఐతే మీరు రెజిగ్నేషను దాఖలుచెయ్యండి. ఆ మీదట విచారిస్తాను.''

సర్వభద్రంగారు కోటు తొడుక్కోసాగాడు.

సుబ్రహ్మణ్యం గుమాస్తాలు కూచునే చోటికి వచ్చాడు.

''మీరంతా ఈ వెధవ ఉద్యోగాలకోసం ఆత్మగౌరవం ఎందుకు చంపుకుంటారు? ఈపాతికరూపాయలకోసం మీరింత నీచంగా ఎందుకు బతకాలి? మీరు మీ పైఅధికారు లన్యాయం చేసినప్పుడు మీ హక్కులకోసం ఎందుకు పోట్లాడరు? పోట్లాడితే ఏమవుతుంది? మీ ఉద్యోగాలు పోతై; తిండి కుండదని భయం. తిండీ, డబ్బూ ఉండ వనే భయం మీ మానవత్వం హరించేస్తున్నది. ఒకపూట తిండి లేకపోయినా డబ్బు లేకపోయినా మీరిట్లా మానవత్వం పోగొట్టుకోరు. నా మాట నమ్మండి! నేను తిండి లేకపోవటమూ ఎరుగుదును. కాని నేను ఈ గుమాస్తా మాదిరిగా మాటలు పడటం నేర్చుకోలేదు. నే నిదే చెబుతున్నాను; అభిమానం పోగొట్టుకున్న వాళ్ల కీ ఆఫీసులో స్థానం లేదు."

ఈ మాట లంటుండగా సర్వభద్రంగారు సుబ్రహ్మణ్యం పక్కగా వెళ్లిపోయినాడు.

సుబ్రహ్మణ్యం తనగదిలోకి వచ్చేసి లూసీని పిలిచి, ''ఒక్క సర్క్యులరు టైపుచెయ్యి. రేపటినించీ సర్వభద్రంగారు వచ్చేవరకూ నేనే మేనేజరుగా ఉంటాను" అన్నాడు.

లూసీ వెళ్ళిపోతూ, "ఒక అర్జంటువిషయం మాట్లాడాలి. ఎప్పుడు మాట్లాడదాం ?" అన్నది.

"ఎంత అర్జంటు ?"

"చాలా అర్జంటు."

"అయితే ఎక్కడ మాట్లాడుకుందాం ?"

"సినిమాకు పోవటానికి వీలవుతుందా ?"

"వీలు చేస్తాను ?"


"రైట్ ! కంగ్రాచులేషన్స్. చీఫ్ ! యు ఆరె స్పోర్ట్ !"

లూసీ సుబ్రహ్మణ్యం చెయ్యి ఊపి వెళ్ళిపోయింది...

"సుస్ ! మన ప్రోగ్రాం తల్లకిందులైంది" అన్నాడు సుబ్రహ్మన్యం టెలిఫోను ద్వారా. "సర్వభద్రం చాలించుకుంటున్నాడు. ఈ రాత్రి నేను కనిపించను. అర్జంటుపని ఉంది. ఇక చాటుపని అవసరం లేదు. కావలసినంత సావకాశం చూసుకుని రికార్డులు తిరగెయ్యొచ్చు..."

## 11

అయిదున్నరకల్లా తన 'భూషణ్' వస్తాడని సుశీల చాలా కష్టపడి ముస్తాబయింది. అతనితో అనదలుచుకున్న మాటలన్నీ తనలో తను ఒకటికి అయిదుసార్లు రిహార్సు చేసుకొన్నది. అతను రావటంలేదని చెప్పగానే ఆమెకు చాలా నిరుత్సాహం కలిగింది. ఆమె చాలాసేపు కాలుగాలిన పిల్లిమాదిరిగా ఇల్లంతా తిరిగి ఆఖరుకు సినిమాకు ప్రయాణమయింది. సినిమాకు ఒంటరిగా పోవటం ఇష్టంలేక తన స్నేహితురాలిని, ఆమె అన్ననూ బలవంతాన ప్రయాణం చేయించింది. ముగ్గురూ కలిసి లోపల కెళ్ళి కూచున్నారు. ఇంకా సినిమా ప్రారంభం కావటానికి అయిదారు నిమిషాల టైముంది. సుశీలకు ముళ్ళమీద ఉన్నట్టున్నది. తన మనస్థితి తెలీక తన వెంట వచ్చిన ఇద్దరూ ఏవేవో చర్చిస్తున్నారు. సుశీల పరధ్యానంగా హాలంతా కలయచూడసాగింది. ఆ చూడటంలో ఆమె తల వెనక్కు తిప్పినప్పుడు వెనుకసీట్సులో ఎవరికీ సంబంధం లేకుండా కూచుని సుబ్రహ్మణ్యమూ, అతనివెంట ఒక నల్ల దొరసానీ కనిపించారు. ఇద్దరికీ తమ ప్రపంచమే గాని ఇంకోటి తెలిసినట్టు కనిపించలేదు. నల్లదొరసాని—అది వాళ్ళ ఆఫీసులో ఉండేదే— సుబ్రహ్మణ్యం భుజంమీద వేలుతో మాటిమాటికీ పొడుస్తూ యేదో చెబుతున్నది, అంతూ పొంతూలేకుండా. సుబ్రహ్మణ్యం మైమరిచి వింటున్నాడు. ఇదే అతని అర్జంటు పని !




సుశీల కళ్ళవెంట గిరుక్కున నీళ్ళు తిరిగినై. అదృష్టవశాత్తూ తన స్నేహితురాలుగాని, దాని అన్నగాని తనను గమనించే స్థితిలోలేరు. తన ఉద్రేకాన్ని ఆపుకోవాలని ఎంతో ప్రయత్నించింది కాని ఆలోచించినకొద్దీ రోషమూ, దుఃఖమూ పొంగుకొచ్చినై. ఆమె చప్పున లేచి తనకు తలనొప్పిగా ఉందని గబగబా బయటికి వెళ్ళిపోయింది. అన్నా చెల్లెళ్ళిద్దరూ ఒకరిమొహా లొకరు చూసుకున్నారు. ఒక నిమిషం ఆగి చెల్లెలు అన్నతో సుశీల ఏమయిందో చూసి రమ్మన్నది. అతను నాలుగయిదు నిమిషాల్లో తిరిగివచ్చి సుశీల ఎక్కడా కనిపించలేదని చెప్పాడు. ఇంతలో లైట్లారి సినిమా ప్రారంభమయింది.

ఆ రాత్రి సుశీల భోజనం చెయ్యలేదు. ఆమెకు జ్వరం వచ్చినట్టుగా ఉంది. ఆమె పక్కమీద ఇటూ అటూ నిద్రపట్టక పొర్లుతూ, "నేను తొందరపడి నిన్ను గురించి ఏమీ అనుకోను భూషణ్. నువు రేపు తెల్లవారగానే వచ్చి జరిగిం దేమిటో చెబుతావు కాదూ ? నన్ను మోసం చెయ్యవు కాదూ, భూషణ్ ?" అని మొరపెట్టసాగింది.

మర్నాడల్లా భూషణ్ జాడ లేదు.

ఆ మర్నాడూ అంతే. టెలిఫోను మీదనన్నా అతను మాటాడలేదు.

మూడోనాడు సుశీల కో ఉత్తరం వచ్చింది. దానిమీద భూషణ్ దస్తూరితో. తన చిరునామా చూడగానే ఆమె గుండె తహతహ లాడింది. వొణుకుతున్న చేతులతో కవరు చించి ఉత్తరం పైకిలాగి ఈ విధంగా చదువుకుంది :

"డియర్ సుస్,

మనం చాలా కాలపు స్నేహితులం. కనక నన్ను నువ్వు సులభంగాక్షమించ గలవు. మనిద్దరమూ నిజంగా ఒకరి నొకరం ఎరగం. నీ అంతరాత్మను అడిగి చూసుకుంటే నీకే ఆ సంగతి తెలుస్తుంది. నువ్వంటే నాకు స్నేహరీత్యా ఎంత ఇష్టమైనా నా హృదయాన్ని మరో సూదంటురాయి చాలా బలంగా లాగేస్తున్నది. ఆ ఆకర్షణనించి తప్పించుకునే శక్తి నాకేమీ లేదు నా కోరిక ఫలించాలని నీ మనస్సులో కోరుకో. మనిద్దరి స్నేహితానికి చలనంలేదనీ, నన్ను నువు అర్థం చేసుకుంటావనీ నమ్ముతూ,

—నీ భూషణ్."

ఒక్కసారిగా సుశీల చైతన్యస్రవంతి ఎండిపోయినట్టయింది. ఆమె చేతిలో నించి ఉత్తరం జారి కిందపడిపోయింది. ఆమె నుదురు నిప్పు వెదజల్లుతున్నది. ఆమె కణతలు టకటకా కొట్టుకుంటున్నై. ఆమె తల్లో యే ఆలోచనా లేదు.

ఒక గంటపాటీస్థితిలో ఉన్నమీదట క్రమంగా ఆమె మనస్సులో ఆలోచనలు బయల్దేరినై. అవి పిల్లగాలులల్లే బయల్దేరి త్వరలోనే తుఫాను ప్రమాణానికి పెరిగినై. దైనిక నాగరికత ఆమెలో అణిచిపెడుతూ వచ్చిన ఉద్రేకాలన్నిటినీ పెల్లగించినై ఆమె ఆ ఉద్రేకాల తాకిడికి తుపానులో కొట్టుకుపొయ్యే తెప్ప మాదిరిగా తేలిపోయింది. ఈ స్థితిలోకూడా ఆమె మనస్సులో ఒక స్పష్టమైన భావం పదే పదే గ్రామఫోను రికార్డల్లే మోగుతున్నది.

గుడ్డిప్రేమలో పడి తను ఎంత వెకిలిదై పోయింది? ఏదో ఘనమైన పని చేస్తున్నా ననుకుని తన ప్రణయాన్నిఎంత విమర్శగా భూషణ్ దగ్గిర ఉపన్యాసం కొట్టింది! తనను గురించి అతను ఎంత నవ్వుకుని ఉంటాడు! తను ఇంతగా బయటపడినా అత నెంత రాయల్లే కూచున్నాడు?— తన దగ్గిర్నించి ఒక్క వాగ్దానం అడక్కుండా!...

"నాన్నా, ఆ రావుబహద్దర్‌గా రబ్బాయి నన్నెప్పుడు పెళ్ళిచేసుకుంటాడు?" అని అడిగింది సుశీల తండ్రిని.

"పెళ్ళా? ఏం పెళ్ళి?" అన్నాడు తండ్రి.

## 12

లేడికి లేచిందే పరుగన్నట్టు భూషణం సీత కావాలనుకోవటం వ్యవధానంగా ఆమెను రాబట్టుకోవటానికి ప్రయత్నాలు ప్రారంభించాడు ఆ రాత్రి షూటిం గున్నది. సీత ఆరుగంటలకే స్టూడియోకు వెళ్ళింది. భూషణానికి ఆ రోజు రంగు

వేసుకునే పనిలేదు. అయినా స్టూడియోకు పోదామనుకున్నాడు. కాని కారులో ఖాళీ లేకపోయింది ఏడున్నరకు లాడ్జినించి భోజనాలు తీసుకుపోవటానికి కారు వచ్చినప్పు డందులోఎక్కి స్టూడియో చేరుకున్నాడు. గ్రీన్‌రూములో సీతకు మేకప్ జరుగుతున్నది. భూషణం అక్కడికి వెళ్ళాడు. ఏ కారణంచేతో దగ్గర్లో సీతతాలూకు మనుషులెవరూ లేరు. సీతకు గుజరాతీ వాడొకడు మేకప్ చేస్తున్నాడు మరోమనిషికి మరో కుర్రవాడు మేకప్ చేస్తున్నాడు.

"ఇదేమిటోచూడు!" అని భూషణం సీతచెయ్యి పట్టుకుని ఆమె చేతిలో ఒక కాగితం పెట్టాడు. అది ఆమె గుప్పెట్లో గట్టిగా పట్టుకోవటంలో భూషణం వేళ్ళు రెండు ఆమె గుప్పెట్లోనే ఉండిపోయినై. భూషణం అద్దంలో సీతమొహంకేసి చూశాడు. ఆమె పెదిమలు వణుకుతున్నై కాని, ఆమె నవ్వు ఆపుకుంటున్న దానల్లే కనిపించింది భూషణం మెల్లిగా తనవేళ్ళు ఆమెపట్టునించి వదిలించుకుని ఇవతలికి వచ్చేశాడు.

వాకిట్లోనే ఎదురైనాడు సీత తండ్రి, "ఏం, శాస్త్రీ? నీ కివాళ షూటింగుందా యేం?" అన్నాడు.

"లేదండీ, మీ అమ్మాయి యేంచేస్తుందో చూడాలని వొచ్చాను."

"మా అమ్మాయేం చెయ్యగలదులే, పెద్దవాళ్లేం చెయ్యమంటే అదే చేస్తుంది" అన్నాడు ముసలాడు గడుసుగా.

"అవున్లెండి. మీ అమ్మాయి చాలాబుద్ధిమంతురాలు నేను చూస్తూనే ఉన్నాగా!" అంటూ ముసలాయనవెంట అతను మళ్ళీ లోపలికి వెళ్ళాడు. అప్పుడే మేకప్ పూర్తిఅయి చీరె కట్టటానికి సీత అవతలికి వెళ్లింది.

ఆ సమయంలోనే సీత భూషణం ఇచ్చిన చీటీ చదువుకున్నది. "సీతా, నిన్ను నేను త్వరలో పెళ్ళిచేసుకోకపోతే, నాకు పిచ్చో యేదో ఎత్తేటట్టున్నది. నువు షాపులో దొరికే వస్తువయినట్టయితే నిన్ను లక్షరూపాయలకు కొనుక్కొని ఉందును. (గొప్పకు చెప్పటం కాదు—నాదగ్గిర లక్షరూపాయలున్నై. అదంతా నీకు తరవాత చెబుతాను.) ముందు నీ పెదిమలు అందరి పెదిమలవంటివో, లేక దొండపళ్లో తెలుసుకోవాలని ఉంది. నాకేమన్నా కాస్త ఆశ చూపిస్తావా, లేకపోతే వెంటనే సామాను సర్దుకుని, పిచ్చాసుపత్రికి పొమ్మన్నావా?"

సీతకు ఆ చీటీ చదువుతుంటే ఒళ్లంతా వొణికింది. అది రాసినవాడిమీద కోపం వచ్చిందికాని వెంటనే వెళ్ళి వాణ్ణి గట్టిగా కావిలించుకో బుద్ధికూడా

అయింది. ఆ చీటీ యేం చెయ్యాలో తెలీలేదు. చించి పారెయ్యటానికి చేతులు రాలేదు. దాన్ని భద్రంగా మడిచి తన బ్లౌజులో దాచుకుని వచ్చింది.

"అమ్మాయి, భోజనం వచ్చిందేః" అన్నాడు తండ్రి.

"అవును, దొండకాయకూర చేసినట్టున్నారు త్వరగా భోంచెయ్యి" అని హెచ్చరించాడు భూషణ్.

అత నామాట అనగానే సీత ఒక్క పర్యాయం కంపించింది. ముసలాడు తన కూతుర్నెరగనివాడు కాడు; సీతనూ, ఈశాస్త్రిగాణ్ణీ ఎడ మెడంగా ఉంచక పోతే లాభంలేదని తెలుసుకున్నాడు.

''మీ అమ్మాయికి దొండకాయ కూర సయించదల్లే ఉంది" అన్నాడుభూషణ్ సీత తండ్రితో.

"మంచిమాట చెప్పారుః నాకు దొండకాయ కూరంటే తగనిష్టంః" అన్నది సీత. కాని ఆమె గొంతుకూడా నిలకడగా లేదు.

సీత వెళుతూ భూషణంకేసి చూసింది. అతను ముసలాడి వెనకనించి ఆయన కేసి తల ఊపి, పెదిమ విరిచి, లాభంలేదన్నట్టు తల అడ్డంగా ఆడించాడు. సీత నవ్వాపుకుని తలవొంచుకుని వెళ్ళిపోయింది. అక్కడితో సీతా భూషనమూ మంచి స్నేహితులైనారు.

తనవంక ఎవడు కాస్త అపేక్షగా చూసినా తన్మయత్వం చెందటానికి సిద్ధంగా ఉన్నది సీత. ఆమె కళ్ళకు భూషణ్ ప్రపంచంలో కల్లా ఎక్కువైన వాడుగా కనిపించాడు. ఆమెను ముఖ్యంగా ఆకర్షించింది అతని అందం ఒకటే కాక ప్రత్యేకించి అతని పట్టుదలా, ధైర్యమూనూ. ఏక్షణాన చూసినా అతను తననుగురించే ఆలోచిస్తున్నట్టూ, తనను పెళ్ళాడే ప్రయత్నంమీద ఉన్నట్టూ కనిపించేవాడు. ఎంతమందిలో ఉన్నప్పుడన్నాసరే తన కొక్కత్తెకే అర్థమయేట్టు యేదో అనేసేవాడు. తనకు చెడ్డభయం వేసేది కాని అతని మొహం మాత్రం తోలుబొమ్మ మొహమల్లే అర్థం కాకుండా ఉండేది. అతను తనకు చీటీఇచ్చిన మర్నాడే అతనికూ్కడా ఆమె రహస్యంగా ఒక చీటీ అందించింది.

"ప్రియమైన శాస్త్రిగారికి,

నన్నెందుకిట్లా బాధిస్తున్నారు ? నాకు నిద్రాహారాలు లేకుండాఉన్నై. కళ్లు మూసుకుంటే మీ మొహమే కనబడుతున్నది. నన్నింతగా బాధపెట్టటంవల్ల మీకేం ఒరుగుతుంది ? కావలిస్తే మా నాన్న నడిగి నన్ను పెళ్ళిచేసుకోండి.

మీ ప్రియమైన సీత"

ఈ ఉత్తరం చూసుకుని భూషణం నవ్వుకున్నాడు గాని దాన్ని బంగారం కంటె జాగ్రత్తగా జేబులో దాచుకున్నాడు. ఇక ఈ వ్యవహారం నాననిచ్చి లాభం లేదనిపించిం దతనికి. అతను ఆరాత్రే ముసలాయనతో మాట్లాడటానికి వెళ్ళాడు. ముసలాయన ఇంటో లేడుగాని సీత తల్లిఉంది.

"ఏమమ్మా, సుబ్బయ్యగారు లేరా?" అన్నాడు భూషణం.

"లేరు నాయనా!" అన్న దావిడ.

"మీ అమ్మాయికి మంచి సంబంధం ఒకటి తెచ్చానండి" అన్నాడుభూషణం.

ఆవిడ ఆత్రంగా "ఎవరు నాయనా?" అన్నది.

"మన కెటువంటి సంబంధమైతే సరిపోతుంది?"

"ఏదో ఇంత తినటానికుండి, చిన్నవాడూ, అందగాడూ, చదువుకున్న వాడూ, మనం చెప్పినట్టు వినేవాడూ అయితే ఇంకేం కావాలి నాయనా!" అన్నది సీత తల్లి.

"అవన్నీ ఉంటే ఇంకేం కావాల్లెండి! నేను చెప్పే కుర్రవాడు పాతికేళ్ళవాడు రెండుమూడు లక్షల ఆస్తి వుంది. ఈ వూళ్లోనే పెద్ద వ్యాపారం ఉంది."

"మన పిల్లను చేసుకుంటాడా?"

"చేసుకోవాలని తహతహ లాడిపోతున్నాడు."

"అతను చేసుకుంటే సరా? వాళ్ళ పెద్దవాళ్ళేమంటారో?"

"ఏమన్నా అనే పెద్దవాళ్లెవరూ లేరు. తల్లీ దండ్రీ, అన్నలూ తమ్ములూ ఎవరూ లేరు. ఒక్క మేనమామ ఉన్నాడు. ఆయన ఈ అబ్బాయి ఎట్లా ఆడిస్తే అట్లా ఆడతాడు."

"ఎవర్నాయనా, ఆ అబ్బాయి?" అన్నది సీత తల్లి ఆశగా.

"నేనే" అన్నాడు భూషణం.

సీత తల్లి నిర్ఘాంతపోయింది.

"సుబ్బయ్యగారితో తరవాత నేనూ మాట్లాడతాను. ఆయన రాగానే చెబుతారు కదూ!"

"చెబుతాను నాయనా!" అన్నది సీత తల్లి.

"సీతేదీ?"

"నీళ్లు పోసుకుంటున్నట్టుంది."

"అయిపోయిందేమో, ఒకసారి పిలుస్తారా?"

తల్లి పిలుపుకు సీత వచ్చింది. ఆమె స్నానం పూర్తయింది కాని తడిపొడి గుడ్డ వంటికి చుట్టుకుని ఉంది ఇంకా చీరె కట్టుకోలేదు.

'సీతా, ఒక్క మాట" అంటూ భూషణం పక్క చీకట్లోకి దారి తీశాడు. సీత తల్లి ఒక్క క్షణం ఆలోచించి లోపలికి వెళ్ళిపోయింది.

మర్నాడు భూషణమూ, సీత తండ్రీ ముఖాముఖీ కలుసుకున్నారు.

"నిన్న రాత్రి మా యింటికొచ్చి మా వాళ్ళతో చాలా విషయాలు మాట్లాడావుట—అవన్నీ నిజమేనా?" అన్నాడు ముసలాయన.

"నేను చెప్పినవన్నీ నిజమే" అన్నాడు భూషణం.

ముసలాయన భూషణంవంక హిప్నోటైజు చేసేటట్టు చూస్తూ, "అబ్బాయీ నేనూ ఇంతో అంతో ప్రపంచానుభవం కలవాణ్ణి నువు నిజంగా లక్షాధికారివే ఐతే మా అమ్మాయిని చేసుకోవటాని కెందు కాదుర్దాపడుతున్నావు? మా అమ్మాయి రంభకాదు. పెద్ద ఉత్తమమైన పుటకాలేదు. నీకదే ఎందు క్కావలిసొచ్చింది?" అని అడిగాడు

"మీరు కుండపగలేసి అడుగుతున్నారు గనక నేనూ కుండపగలేసి చెబుతున్నాను—సీతకు మీవంటి తండ్రి లేకపోతే నే నా అమ్మాయిని పెళ్లాట్టానికింత ఆదుర్దాపడను."

"అనగా?"

"మీ స్వార్థంకోసం దాన్నేం చెయ్యటానికైనా మీకు తెలివితేటలున్నై!"

ముసలాడు సాలోచనగా నేలకేసి చూసి మీసం మెలిపెడుతూ "హుఁ" అన్నాడు.

"నేను మిమ్మల్ని తొందరపెట్టను. ఆలోచించుకోండి. నా కింకా మూడు వారాల దాకా వేరే పని ఉంది."

"మళ్ళీ ఆ విషయమే ఎత్తుతున్నాను—నువు లక్షాధికారి వయితే ఇక్కడ మా సినిమాలోచేరి వేషం వేస్తున్నా వెందుకు?"

"ఎప్పటికైనా నేనే సినిమాలు తీద్దామని. ఈ విషయం మళ్ళీ మీ రింకోరి దగ్గిర అన నవసరం లేదు."

"అట్లాగే? దానికేం?...ఇక అసలు విషయం చెప్పేస్తాను. అబ్బాయీ, సీత కుటుంబాని కంతకీ కామధేనువు. అది పేరు ప్రతిష్టలు తెచ్చుకుంటే సంఘంలో మేమూ ఓ చెప్పుకోదగిన మనుష్యులమవుతాం. అంతే కాదు. అది నాలుగు డబ్బులు చేరిస్తే మా ఇద్దరు పిల్లల చదువూ, ఇద్ద రమ్మాయిల పెళ్ళిళ్ళూ అయి



పోతై. సీతను నేను ఏం చెయ్యగలిగినా చెయ్యగలనన్నట్టు మాట్లాడావు నేను చెయ్యదలిచింది ఇంతకంటె ఏమీ లేదు. ఇదే దాని గొంతు కొయ్యటం అంటావా? అను! నేను మాటలకు వెరిచేవాణ్ణి కాను. మిగిలినవాళ్ళు బాగుపడటానికి దాని గొంతు కోసేస్తాను. దానిమీద నాకు పగ యేమీలేదు. పైకొచ్చే గీత నా పిల్లల్లో ఎవరికున్నా వాళ్ళ గొంతు కోసి మిగిలినవాళ్ళను బాగుచెయ్యటానికి సిద్ధమే. ఇంటికోసం దీపం పెట్టుకుంటాంగాని దీపంకోసం ఇల్లు తగలబెట్టుకోముగా! అందుకని ఈ పెళ్ళి విషయం నువ్వేమీ ఆశ పెట్టుకోకు."

"మీ అమ్మాయికి సినిమాలో ఛాన్సు రాకపోయినట్టయితే?"

ముసలాయన నవ్వి "నువు తెలివిగలవాడివిగాని కుర్రతనం వున్నది. ఉన్నది లేదనుకుని మధనపడే మూఢుడెవడైనా వుంటాడా? నీకు డబ్బే లేదనుకుంటే?" అన్నాడు.

భూషణం ఈసారి తను నవ్వి, "నాకు డబ్బు లేదనుకుని ఏంజరుగుతుందో చూడటమే నేను ప్రస్తుతం చేస్తున్నది. కనుక ఇటువంటి మూఢు లుండరనుకోకండి" అన్నాడు.

ముసలాయన భూషణంవంక చాలా సేపు ఆశ్చర్యంతో చూసి, "నీవంటి అల్లుడు నాకింకోడు దొరకడు. మా సీతను చేసుకో. ఇందాకా నేను నిన్ను వేసిన సవాళ్ళన్నీ చూసి, నువు మా అమ్మాయికి ఎంత మంచి మొగుడివో నేను గ్రహించలే దనుకోకు. నీకు తినటాని కింత తిండి ఉన్నా, మా పిల్లకు నువు గొప్ప సంబంధమే. నే నెరుగుదును. ఒకవేళ మా పిల్లకు చదువులూ, పెళ్ళిళ్ళూ సక్రమంగా కాకపోయినా, పోనీలే, నా కింతవాడల్లుడొక డున్నాడుగదా అనుకుని సంతోషిస్తాను. నువు మా సీతను చేసుకో నాయనా! అది నిజంగా అదృష్టవంతురాలే. ఇంతకాలమూ అది గొప్ప దవుతుం దనుకున్నానేగాని అదృష్టవంతురాలవుతుం దనుకోలేదు" అన్నాడు.

కర్కోటకం చెయ్యటానికి తాహతున్న మనిషి మంచితనానికి దిగేటప్పటికి భూషణం మనసు మెత్తబడింది.

"నేను సీతను పెళ్ళాడతా నన్నానుగాని మీ దగ్గర్నించి అపహరిస్తాననలేదు. సినిమాల్లో వేషాలువేసి పేరు తెచ్చుకునే సామర్థ్యం దానికుంటే, అడ్డంరావటం కూడా నా ఉద్దేశం కాదు దాని సంపాదనమీద బతకాలనే నిర్బంధమూ నాకు లేదు. మీరే శ్రమపడి దాన్నింతదాన్ని చేశారు. ఆ ప్రతిఫలంకూడా మీరే పొందండి. దానికి వచ్చే ఖ్యాతి యావత్తూ మీరు పెట్టినభిక్షే అనుకోండి. అక్కడ నేను దానికి చెయ్యగల సహాయం ఏమీలేదు. ఇక మిగిలిన విషయాల్లో దానికే కొరతా లేకుండా చూసే భారం నాదీ!" అన్నాడతను.

వెంటనే భూషణం సుశీలకు ఉత్తరం రాశాడు. ఆ ఉత్తరం సుశీలను దుఃఖ సముద్రంలో ముంచగల కారణాంతరా లిటీవల ఏర్పడినట్టు భూషణం కలలోకూడా అనుకోలేదు. అసలు అతను సుశీలను గురించి దీర్ఘంగా ఆలోచించలేదు. కాలం రెక్కలు కట్టుకుని ఎగిరిపోతున్నట్టున్న దతని ప్రాణానికి. ఒకవారమో, సంవత్సరమో, యుగమో గడిచింది. లాడ్జిలో వాళ్ళంతా యేదో పత్రికల్లో పడిన విషయం వింతగా చెప్పుకుంటున్నారు. "కడపా యేజెన్సీస్'' అనే మాట తన చెవిన పడేదాకా అతనేమీ పట్టించుకోలేదు. ఆ మాట వినగానే అతను చప్పున పేపరు సంపాదించి చూశాడు. అందులో పెద్దటైపులో ఉన్న రెండు వాక్యాలూ కళ్లపడగానే అతనికి మతిపోయినట్టయింది.

"కడపా యేజెన్సీస్ ఆఫీసులో కలవరం. మేనేజరు, ప్రొప్రయిటర్ల పరస్పర వంచన."

దానికింద కొద్దిపాటి వివరాలున్నై. వాటి సారాంశమేమిటంటే కడపా యేజెన్సీసు ప్రొప్రయిటరు, మేనేజరుమీద ఆఫీసు డబ్బు అన్యాక్రాంతం చేసి నష్టం తెస్తున్నాడని కేసు పెట్టాడు. ప్రొప్రయిటరు ప్రొప్రయిటరే కాడనీ మారు పేరుతో వ్యవహరిస్తున్న దొంగ అనీ మేనేజరు కేసు పెట్టాడు. పూర్తి వివరాలు బయటపడ్డ తరవాతగాని దీని లోతుపాతులు తెలియవు.

## 13

ఆ రోజు తనను సినిమాకు తీసుకుపోయి లూసీ, "సర్వభద్రం ఇటువంటి మోసం చేస్తున్నాడని నాకు సందేహంగా ఉంది" అని చెప్పినప్పుడు సర్వభద్రం జుట్టు తన చేతిలో చిక్కిందని సుబ్రహ్మణ్యం సంతోషించాడే గాని అంతకు గంటపూర్వమే తనగుట్టు సర్వభద్రం తన నోటిమాటల వల్లనే విని ఊహించాడని అతనికి అనుమానం పోలేదు.

అసలే సర్వభద్రం వెయ్యికళ్ళు గలవాడు. వెనుకటి ఇంద్రుడు పాపంచేసి బయటపడి వెయ్యికళ్ళు తెచ్చుకుంటే, సర్వభద్రం పాపంచేసి బయటపడకుండా ఉండగలందులకు వెయ్యికళ్లు తెచ్చుకున్నాడు. ఆయనకూ, సుబ్రహ్మణ్యానికీ ఘర్షణ జరిగి ఆయన బయటికి పోతుండగా సుబ్రహ్మణ్యం గుమాస్తాలతో, తనకు డబ్బు లేకపోవటమూ, తిండి లేకపోవటమూ కూడా అనుభవమేనని చెప్పటం చెవినపడింది. భూషణం డబ్బు లేకుండానూ, తిండి లేకుండానూ ఎందుకున్నాడో, ఎప్పుడున్నాడో సర్వభద్రం ఊహించలేక పోయినాడు. భూషణం విదేశాలలో ఉన్నప్పుడు కూడా అతనికి ఇక్కణ్ణించి వేలకువేలు పంపింది సర్వభద్రమే. భూషణం కాదేమోనని అనుమానం పుట్టిన తర్వాత అది బలపడటానికి కెంతయినా సాక్ష్యం ఉంది. ఇతను భూషణం అయితే ఆఫీసులో అడుగు పెడుతూనే, గుమాస్తా లడక్కుండా చెయ్యకుండా వాళ్ళ జీతాలు పెంచేస్తాడా? వాళ్లమీద మమకారంచేత మేనేజరును పోగొట్టుకుంటాడా? ఇతను భూషణం ఎన్నటికీ కాడు. భూషణం అయినవాడు మాట్లాడదగినట్టుగా మాట్లాడటం కూడా ఇతనికి తెలీదు-ఇతని దస్తూరీ చూడటం జరిగినా సర్వభద్రం పట్టుకో గలిగే వాడు.

ఆరాత్రే కొండల్రావు తన యింటికి వచ్చినప్పుడు సర్వభద్రం అతనికి తన

అనుమానం చెప్పి, అది రహస్యంగా అట్టేపెట్టమని హెచ్చరించి, ఎట్లాగైనా భూషణం దస్తూరీగల కాగితం ముక్క ఒకటి సంపాదించమన్నాడు.


మర్నాడు కొండ్రావు ఆఫీసుకు వస్తూనే భూషణానికి ఒక కాగితం రాశాడు – మిగిలిన గుమాస్తాలందరి జీతాలు పెంచి తన జీతం పెంచకపోవటానికి కారణం తెలుపవలసిందని ఏ కారణమూ లేనట్టయితే తన జీతం కూడా పెంచవలసింద నీనూ. ఆ కాగితం ఆఫీసు కుర్రవాడి ద్వారా లోపలికి పంపించాడు కొండ్రావు ఆశించినట్టే సుబ్రహ్మణ్యం దానిమీద "నాకు ప్రస్తుతం తీరికలేదు. తరవాత చూస్తాను" అని రాసి సంతకం చేసి తిప్పి కొండ్రావుకు పంపాడు.

నిజానికి అతనికి చేతినిండా పనిఉంది. సర్వభద్రం అతనికి చాలా పని కల్పించాడు

టోకున కొని చిల్లర్ను అమ్మటం కడపా ఏజెన్సీస్ చేసేపని. పెద్ద పెద్ద మాన్యు ఫాక్చరర్లకు ఏజెంట్లుగా ఉండి వాళ్ళదగ్గిర కొనే సరుకు చిల్లర వ్యాపారస్తులకు పంపుతూ ఉంటారు. ఇరవై, ముప్పై పెద్ద కంపెనీలకు ఈ కంపెనీ ఏజెంటుగా పనిచేస్తున్నది. ఆ పరపతి యావత్తూ భూషణం తండ్రిగారు సంపాదించినదే. అక్కడ సర్వభద్రంగారి ప్రయోజకత్వం ఏమీలేదు. కాని ఆయన దేశమంతటా రెండు మూడు వందల చిల్లర వ్యాపారస్థులమీద అమ్మకాలు ఆర్గనైజ్ చేశాడు. కొత్త వస్తువు మార్కెట్లో పెట్టటంలోగాని, బాకీలు వసూలుచెయ్యటంలోగాని సర్వభద్రం సిద్ధహస్తుడు. ఎవరికి అప్పు పెట్టవచ్చునో, ఎవరి కెంత అప్పు పెట్ట వచ్చునో చాకచక్యంగా నిర్ణయించేవాడు. ఆయనకు తన అందరి క్లయంటుల వివరాలూ కరతలామలకం.

ఐతే భూషణం తండ్రిగారి హయాంలోనే సర్వభద్రానికి డబ్బు దాహం పట్టుకుంది. చిన్నచిన్న మాన్యుఫాక్చరర్లు తమ యేజెన్సీ తీసుకోమని వచ్చి నప్పుడు వాళ్ళదగ్గిర లంచాలు పుచ్చుకోసాగాడు. ఎంతోకాలంగా తమతో వ్యాపారం చేస్తున్న పెద్ద కంపెనీల దగ్గిరే లంచాల కాశించటం మొదలు పెట్టాడు. తనకు డబ్బు ముట్టజెప్పిన మాన్యుఫాక్చరర్ల దగ్గిర తక్కువ కమీషన్ ఆమోదించాడు. లంచం ఇవ్వనివాళ్ళకు "మీరిచ్చే కమిషను మాకు చాలటం లేదు" అని రాశాడు ఈయన ప్రవర్తనవల్ల ఇప్పటికే రెండుమూడు విలవైన కంపెనీలూ, అయిదారు చిల్లర కంపెనీలూ కడపా యేజెన్సీస్‌తో వ్యాపారం చాలించుకున్నై.

చిల్లరవర్తకుల దగ్గిరకూడా ఈ విధంగానే సర్వభద్రం లంచాలు పట్టాడు. తనకు లంచం పెట్టినవాడికి అప్పు పెట్టటమూ, తక్కువ కొటేషన్లివ్వటమూ,




తన క్లయింట్లతో పోటీచేసే స్థానిక వ్యాపారస్తులను ప్రోత్సహించటమూ చేశాడు. ఈ దిక్కుమాలిన పనులన్నీ చెయ్యటానికి కొండ్రావు సర్వభద్రానికి కుడి భుజంగా పనిచేశాడు.

భూషణం తండ్రి పోగానే సర్వభద్రాని కింకా పెద్ద కోరికలు పుట్టినై. ఏ విధంగానైనా కడపా యేజెన్సీస్ దివాలా ఎత్తించేసి ఈ వ్యాపారమంతా తన సొంతాన చేసుకుందామని ఆయనకు ఆశకలిగింది ఒక్కొక్క మాన్యుఫాక్చరర్నీ కడపా యేజెన్సీస్‌నుంచి వదిలించి వాళ్ళ వ్యాపారం సొంతాన చేసుకోవాలని ఆయనకు సంకల్పం కలిగింది.

ఇప్పటికి నాలుగైదు చిల్లర కంపెనీవాళ్లు ఆయనతో వ్యాపారం చేస్తున్నారు. వాళ్ళ ఉత్తరాలు కడపా యేజెన్సీస్ కేరాఫుగా వస్తునై. వాళ్ళ సరుకు కడపా యేజెన్సీస్ గోడౌన్స్‌లో ఉంది. కాని ఆ సరుకు అమ్మకంతోగాని, లాభాలతో గాని కడపా యేజెన్సీస్‌కు సంబంధంలేదు. దీనిమూలంగా ఇప్పుడు సర్వభద్రం కడపా యేజెన్సీస్‌తో తెగతెంపులు చేసుకోవటాని క్కూడా లేదు.

కడపా యేజెన్సీస్‌ను కడతేర్చటానికి సర్వభద్రం ఇంకో ఎత్తుకూడా ఎత్తాడు. ఎవరికీ అవసరంలేని తుక్కుసరుకు వేలకువేల రూపాయల ఖరీదున కొని గోడౌన్సులో డంపుచేశాడు.

ఇటువంటివన్నీ సర్వభద్రం చేస్తున్నట్టు తన కనుమానంగా ఉందని లూసీ సుబ్రహ్మణ్యానికి స్థూలంగా సూచించింది. ఆమెకైతే వివరాలు తెలీవు. సర్వభద్రం అప్పుడప్పుడూ రాసే ఉత్తరాలధోరణిచూస్తే ఆమెకు సందేహం కలిగింది.

సుబ్రహ్మణ్యం ఈ విషయం లో తులాగందే నిద్రాహారాలు స్వీకరించదలచ లేదు. అతను ముందు ఉత్తరాల ఫైల్సు తిరగేశాడు - ఊరికే చదవటం కాదు, తీవ్రమైన స్తనశల్యపరీక్ష ప్రారంభించాడు. కమీషను ఎక్కువ చెయ్యమనీ, తక్కువ చెయ్యమనీ సర్వభద్రం రాసిన ఉత్తరాలూ, మీ యేజెన్సీ మా కవసరం లేదని పైవాళ్లు రాసిన ఉత్తరాలూ గుర్తుపెట్టాడు. ఆఫీసుకు వచ్చిన ఉత్తరాల్లో రిఫరెన్సులు చూస్తే ఆఫీసునించి వెళ్ళిన ఉత్తరాల కాపీలు కొన్ని ఫైలులో లేనట్టు స్పష్టమయింది. ఆ బాపతు ఉత్తరాలన్నీ నోటుచేసుకున్నాడు.

తరవాత ఎకౌంటుపుస్తకాలన్నీ తనిఖీచేసి తనకు సందేహంగా ఉన్న ఎంట్రీలన్నీ గుర్తుపెట్టాడు. ఆ పని పూర్తిచేసుకుని స్టాక్ చెకింగ్ ప్రారంభించాడు. ఈ అంతులేని పని చెయ్యటానికి ఆఫీసంతా నాలుగురోజులు నిద్రాహారాలు మాని పనిచెయ్యవలసి వచ్చింది. కొండల్రావు తప్ప మిగిలినవాళ్లంతా పనిచేశారు. అందరి మొహాలూ వాడిపోయినై. కాని కృషి ఫలించింది. ఒకరోజల్లా కూచుని లూసీ సహాయంతో సుబ్రహ్మణ్యం సర్వభద్రంగారి మేనేజిమెంటుమీద బ్రహ్మాస్త్రం లాంటి స్టేట్‌మెంటు తయారుచేశాడు. లూసీ దాన్ని ఇంటికి తీసుకుపోయి రాత్రల్లా కూచుని అరుకప్పుల టీ సహాయంతో టైపుచేసింది. మర్నాడు సుబ్రహ్మణ్యం ఆ స్టేటుమెంటు పట్టుకుని ప్లీడరుదగ్గిరికి వెళ్ళి సర్వభద్రంమీద చార్జీ పెట్టించాడు.

## 14

ఆఫీసు వ్యవహారా లిక్కడి కీవొడ్డు పట్టినతరువాత సుబ్రహ్మణ్యానికి సుశీల దిగులు పట్టుకున్నది. ఆమెకు ప్రతిరోజూ రెండుమూడుసార్లు టెలిఫోను చేయిస్తూనే వస్తున్నాడు గాని ఆమె ఎప్పుడూ ఇంటో ఉండటంలేదు. సుశీల ఇంటో ఉండే లేదనిపిస్తున్నదనే అనుమానం అతనికి కలలోకూడా కలగటాని కవకాశం లేకపోయింది.

అత నిప్పుడు ప్లీడరుగా రింటినించి నేరుగా సుశీల యింటికి వెళ్లాడు. మధ్యహాల్లో పడకకుర్చీలో నిశ్చలంగా పడుకుని ఉంది సుశీల.

"సుస్!" అన్నాడు సుబ్రహ్మణ్యం.

సుశీల కొట్టినట్టు లేచింది. ఆమె తనవంక చూసే చూపు సుబ్రహ్మణ్యాని కర్థంకాలేదు. తను భూషణ్ కాదని ఆమె కప్పుడే తెలిసిపోలేదు గదా!

అతని కళ్ళలో ఆమెకు యేదో భయం కనిపించింది

సుబ్రహ్మణ్యం దరికొచ్చి ఆమెచెయ్యి పట్టుకోవటానికి ప్రయత్నిస్తూ, "నిన్ను చూసి ఎంతకాల మైనట్టుంది సుశీ!" అన్నాడు.

ఆమె రెండడుగులు వెనక్కు వేసింది. అతని ప్రవర్తన ఆమె కర్థంకాలేదు. అతని మొహం తీసిపోయింది. గడ్డం మాసింది, గొంతు మారింది. ఈ నాలుగు రోజుల్లోనూ అతనికేం దెబ్బతగిలి ఉండవచ్చునో ఆమెకు తెలియరాలేదు. కాని పెద్దదెబ్బ తిన్నవాడల్లేమాత్రం ఉన్నాడు. అతనిమీద ఆమెకు జాలిపుట్టిందిగాని అది పైకిరావటానికి సాహసించలేదు.

''ప్రతిరోజూ నీకు టెలిఫోను చేయిస్తున్నాను. కాని నువ్వింటో ఉండటం లేదు. ఈ నాలుగురోజులూ యమచరలో ఉన్నాను సుస్. కాని నా పని అయిపోయింది. మళ్ళీ మామూలు ప్రపంచంలో పడ్డాను.''

అదీ విషయం! తను రాసిన ఉత్తరం ఉపసంహరించుకోవటానికి వచ్చాడు, పాపం! సుశీలకు అతన్ని చూస్తుంటే మండిపోయింది. అందరు మగవాళ్లూ ఇంతేనా! లేక ఇది తన ప్రత్యేక అదృష్టమా? ఇప్పటికైనా తను అతన్ని క్షమించగలదు - కాని, పశ్చాత్తాపంలోకూడా అతను అతని యమచరే ఆలోచిస్తాడు గాని తన యమచర ఆలోచించడే!

"నీకు తెలిసిఉండకపోవచ్చుగాని, నేనూ చాలా యమచర అనుభవించాను, భూషణ్!"

"సుస్!'' అన్నాడు భూషణ్ ఆశ్చర్యంతోనూ, బాధతోనూ. "నాకు తెలీదే! నా కెందుకు చెప్పలేదు, సుశీ? యే మనుభవించావు?"

అతని ఆదుర్దా యావత్తూ ఆమెప్రాణానికి వొట్టి అసమర్థపు నటన కన్నా అన్యాయంగా కనపడ్డది. అతనికి నిజంగా కావలిసింది తన సానుభూతీ, క్షమాపణా అయితే వాటిని సాధించటానికి సరయినమార్గం తొక్కటంలేదు.

"నువ్వేం విచారించక్కర్లేదు, భూషణ్! నేనూ నీమాదిరిగానే మనుష్య ప్రపంచంలో పడ్డాను. నన్ను కంగ్రాచులేట్ చెయ్యి. నేను రావుబహదూర్ గారబ్బాయిని చేసుకోబోతున్నాను" అన్నది సుశీల.

"ఏమిటీ? నువు—నాకేమీ అర్థంకాలేదు" అన్నాడు సుబ్రహ్మణ్యం.

సుశీల నవ్వగలిగింది. "అర్థం కాకపొయ్యేటందు కేముందీ? నేను రావుబహదూర్ గారబ్బాయిని పెళ్ళి చేసుకోబోతున్నాను. నీ పెళ్ళికూడా సెటిల్ అయిందా? అయితే నిన్నుకూడా నేను కంగ్రాచులేట్ చేస్తాను."

"పెళ్లా? యేం పెళ్ళి?" అన్నాడు సుబ్రహ్మణ్యం సుశీల ధోరణి ఏమీ అర్థంకాకుండా.

సుశీల ఈసారి గట్టిగా నవ్వింది. "మా నాన్నలల్లే మాట్లాడకు భూషణ్!"

"మీనాన్న! ఆయనే చేశా డీపని! ఆ రావుబహదూర్ సంబంధం ఆయనదే. నిన్నడ్డంపెట్టి ఆయన పెళ్ళిచేసుకుంటున్నాడు!... నన్నేడిపించటానికి దొంగెత్తు వేస్తున్నావా సుస్?"

"లేదులేదు. నిజంగానే చేసుకుంటున్నాను. నేను పరిహాసంచేస్తున్న మనిషల్లే ఉన్నానా?"

"ఈ ఘోరమైన పని నువ్వెందుకు చేస్తున్నావో నాకు తెలీదుగాని, ఏదో కారణం లేకుండా తలపెట్టిఉండవు. చెప్పటాని కభ్యంతరం లేకపోతే ఆ కారణం చెప్పిఉండేదానివే! అదేమైనా కానీ, నేను పెట్టిన గడువు వెళ్ళేదాకా నామీది కోపంచేతగాని, మరో కారణంచేతగాని, తొందరపడి యేమీ చెయ్యకు. నిన్ను బ్రతిమాలుకుంటాను సుశీ!'' అన్నాడు సుబ్రహ్మణ్యం, ఆవేదనలో ఉన్నవాడల్లే.

అతను పడుతున్న బాధ యదార్థమల్లేనే ఉందని సుశీల ఒప్పుకోవలసివచ్చింది. అదంతా నటన అనుకోవటం అధర్మం. కాని అతని ఆవేదనకు అర్థంలేదు. అతను రాసిన ఉత్తరంలో ఈ ఆవేదన యేమీలేదు. ఆ ఉత్తరం రాసినవా డితనని నమ్మటానికే లేకుండా ఉంది. అది అట్లాఉంచి ఇతను ఇంత మాట్లాడుతాడు గానీ ఆ ఉత్తరం గురించి ఎత్తడేం? పోనీ, దానికి క్షమాపణ అయినా చెప్పకోడేం? ఒకవేళ ఆ ఉత్తరం ఇంకెవరన్నా రాశారా? దస్తూరీ ఇతనిదేనే!... ఇందులో యేదో రహస్యం ఉంది. అది మెల్లిగా పైకి లాగాలి.


"నుంచునే ఉన్నావు భూషణ్, కూర్చో!"

ఆమె గొంతులో మార్పుకు సుబ్రహ్మణ్యం చాలా తృప్తిపడి కూచున్నాడు.

"ఈ నాలుగురోజులూ నువుపడిన యమయాతనేమిటో చెప్పవూ?"

సుబ్రహ్మణ్యం ఉత్సాహంతో తను చేసినదంతా వర్ణించాడు. సర్వభద్రం చేసిన దగా యావత్తూ వివరించాడు.

అంతా విని సుశీల, "ఇంతేనా? ఇంకేం చెయ్యలేదా?" అని అడిగింది.




సుబ్రహ్మణ్యం ఆ ప్రశ్నకు చాలా నొచ్చుకున్నాడు "ఇదంతా విని నువ్వెంతో మెచ్చుకుంటావనుకున్నాను. 'ఇంతేనా' అంటావని అనుకోలేదు," అన్నాడు.

"నేనెందుకు మెచ్చుకోను, భూషణ్ ! నువు చేసిన పనికి నిజంగా నేనెంతో గర్విస్తున్నాను."

"ఏమో ! పైకిమాత్రం అట్లా కనిపించటం లేదు" అన్నాడతను కాస్త సాధింపుగా.

"దానిక్కారణం ఉంది, భూషణ్. నేను మరో సంగతి ఆలోచిస్తున్నాను."

"ఏమిటా విషయం ?"

'నీ ఉత్తరం."

అతని మొహంలో మార్పేమన్నా కలుగుతుందేమోనని ఆమె అతని మొహం కేసి పరీక్షగా చూసింది.

అటువంటి మార్పేమీ కలగలేదు. "ఏం ఉత్తరం ?" అన్నాడతను.

సుశీల లేచివెళ్ళి ఉత్తరం తెచ్చి అతని చేతికిచ్చి "ఇదీ !" అన్నది. సుబ్రహ్మణ్యం ఉత్తరం చదవలేదు. దానికేసి చూసి, "ఇది నేనెందుకు రాశానూ ? నేను రాయలేదు" అన్నాడు.

ఈసారి సుబ్రహ్మణ్యం ఉత్తరంమీది సంతకం చూశాడు. అతనికంతా అర్థమయింది. అది భూషణం రాసిన ఉత్తరం అయుండాలి.

"ఆ దస్తూరీ నాది కాదు" అన్నాడతను.

అతని బుకాయింపు చూసి సుశీల ఆశ్చర్యపడుతూ, "భూషణ్ !" అన్నది.

సుబ్రహ్మణ్యం కూచున్న చోటినించి లేచి ఒక్కొక్క అడుగే వెనక్కు వేస్తూ, ''నన్నా పేరుతో పిలవకు. నా పేరు భూషణ్ కాదు. నా పేరు సుబ్రహ్మణ్యం ! గుడ్‌బై, సుస్'' అని గిరుక్కున తిరిగి వెళ్ళిపోయినాడు.

## 15

సుబ్రహ్మణ్యం ఆఫీసులో వచ్చి కూచున్నాడు. అతని శరీరంలోగాని, బుద్ధిలోగాని, అరతులమెత్తు సత్తాకూడా మిగిలినట్టులేదు. తనపని అయిపోయింది. అది జయప్రదంగా ఐపోయిందన్న తృప్తి ఏమాత్రమూ అతనికి దక్కలేదు. తను చేసిన దేముంది ? దోపిడివిధానంమీద పైకొచ్చే ఒక కంపెనీని ఒక దోపిడిగాణ్ణించి రక్షించాడు. ఈ దోపిడివర్గానికే చెందిన ఒక మనిషిమీద భ్రమ పెట్టుకుని ఆఖరుకు ఆమెనుకూడా పోగొట్టుకున్నాడు. నిజానికి సుశీల తనకు దక్కుతుందని అతనెన్నడూ గట్టిగా ఆశించలేదు. ఈపాటి ఆశ ఐనా అతనికి కలగటానికి సుశీల ఉత్సాహమే కారణం. అంతేకాని తనకూ, సుశీలకూ ఏమిటి సంబంధం ? తను భూషణం పేరు పెట్టుకోబట్టి కాని లేకపోతే ఆమెతో తనబోటివాడికి పరిచయం అయే ఆస్కారంకూడా లేదు. ఏ గుమస్తాపనో చూసుకోవలసిన అవసరం తనకింకా అట్టేఉంది. ఆ అవసరం పదిరోజులు వాయిదాపడిందేగాని పూర్తిగా తప్పిపోలేదు.

కాని తనకిప్పుడు ఏ గుమస్తాపనో చెయ్యటం సాధ్యమవుతుందా ? ఈ పదిరోజుల్లోనే తను ఇంత మారాడా ? ఈ మాత్రానికే తను మారితే నడమంత్రపు సిరి వచ్చినవాళ్ళు మార కేంచేస్తారు ?... భూషణం తన కింత అపచారం ఎందుకు చెయ్యాలి ? ధనికులు దరిద్రులకుచేసే ఉపకారాల్లో ఇదో కొత్తరకం కామాలు.

సుబ్రహ్మణ్యం చెయ్యవలసినపని ఇంకా కొంత మిగిలిఉంది. సర్వభద్రం పోగొట్టిన కంపెనీలను మళ్ళీ రాబట్టటానికి తన చాతనైన ప్రయత్నం చెయ్యాలి. వారందరికీ క్షమాపణపత్రాలు పంపుకుని మళ్ళీ యథాప్రకారం వ్యాపారం సాగించమని వేడుకోవాలి. అత డా పని చూడసాగాడు.

మధ్యాహ్నం రెండుగంటలవేళ సుబ్రహ్మణ్యానికి అతని ప్లీడరు టెలిఫోను చేశాడు. "మీరు కంపెనీ ప్రొప్రయిటరు కాదనీ, మారుపేరు పెట్టుకొచ్చిన మోసగాడనీ మీమీద సర్వభద్రంగారు చార్జీపెట్టేటందు కతనికేమైనా ఆధారం ఉందా ?" అని అడిగాడు ప్లీడరు.

"ఉంది లెండి నిజానికి నేను భూషణ్ కాను—అతని ఏజంటును. అతని తరఫున ఆఫీసులో జరిగే దుర్మార్గం ఆరాతియ్యడానికి వచ్చాను. స్టేట్‌మెంటు నా అసలు పేరుతోనే పడెయ్యండి...బి. సుబ్రహ్మణ్యం... అవును అదే నా అసలు పేరు...లేదు భూషణ్ దగ్గిర్నుంచి ఆథరైజేషన్ లెటర్ లేదు అవసరం లేదు. అతను మనకు కావలసినప్పుడువచ్చి స్టేట్‌మెంటు ఇవ్వగలడు ...ప్రస్తుతం ఆతను ఎక్కడ ఉన్నదీ స్పష్టంగా తెలీదు. మొత్తంమీద ఈ ఊళ్లోనే ఉన్నాడు. నాకిరవైనాలుగు గంటల టైమిస్తే అతన్ని ఎప్పుడైనా తెప్పించగలను... అట్లాగే, ఇప్పుడే ప్రయత్నించటం ప్రారంభిస్తా థాంక్యూ!"

ఎక్కడ ఉన్నదీ తెలీని మనిషిని ఎట్లా పట్టుకోవటం? పోలీసువాళ్ళకే మనుష్యు లందరే? తనకు భూషణం ఎట్లా అందుతాడు? సుబ్రహ్మణ్యానికి ఏ ఉపాయమూ తట్టలేదు. అతను లూసీని పిలిచి "ఈ ఊళ్ళోనే మన వ్యవహారానికి సంబంధించిన మనిషి ఒక డున్నాడు. ఎక్కడున్నాడో తెలీదు. అతన్ని మన ఆఫీసుకు రప్పించటానికి నువ్వయితే ఏం ఉపాయం చేస్తావు?" అన్నాడు.

లూసీ నవ్వి. "డిటెక్టివు నవలలు చదివే నాబోటివాళ్ళ కిటువంటి ఉపాయాలు చాలా తెలుస్తై...ఆ మనిషికి మన ఆఫీసు గొడవ ఏమన్నా తెలుసునా?"అన్నది.

"తెలీదు."

లూసీ భుజా లెగరేసుకుంటూ టెలిఫోను దగ్గరికి పోయి రిసీవరుతీసి ఒక చేతిలో పట్టుకుని రెండోచేత్తో డైరెక్టరీ పేజీలు తిప్పసాగింది.

"ఎవరిని పిలుస్తున్నావు?" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"మన క్కావలసిన మనిషిని" అన్నది లూసీ.

లూసీ తనకు కావలసిన నెంబరు కాల్‌చేసి, "హల్లో! ఈజ్ దట్—? థాంక్యూ!...కడపా ఏజెన్సీస్‌లో మంచి వినోదం జరుగుతున్నది. ఏమిటో తెలుసుకోవాలంటే వెంటనే మనిషిని పంపించండి" అన్నది. ఈ విధంగానే మరో ఇద్దరు ముగ్గురికూడా టెలిఫోను చేసింది.

లూసీ పత్రికలవాళ్ళని పిలుస్తున్నదని సుబ్రహ్మణ్యం ఊహించాడు. ఆమె కీ ఆలోచన తట్టటానికి కారణం డిటెక్టివు నవలలు చదవటం అవునో కాదో గాని, భూషణ్ ఆనాడు రైల్లో చదువుతున్న డిటెక్టివ్ నవలను హేళనచేసినందుకు సుబ్రహ్మణ్యాని కిప్పుడు కష్టం కలిగింది.

మూడు గంటలకల్లా నలుగురు పత్రికలవాళ్లూ వచ్చి లూసీతో మాట్లాడి వెళ్ళి

పోయినారు. అందులో ఒకరిద్దరు సర్వభద్రం దగ్గరకుకూడా వెళ్ళి ఆయన చెప్పిందికూడా పత్రికలో కెక్కించారు.

ఆవిధంగా భూషణం తన ఆఫీసులో జరుగుతున్న హడావుడంతా తెలుసుకోవటం జరిగింది. ఈ వార్తలు పత్రికలో చదవగానే అతను డైరెక్టరుదగ్గరా, మేనేజరుదగ్గరా శలవుకోరి కడపా ఏజెన్సీస్‌కు వచ్చేశాడు.

భూషణాన్ని చూడగానే సుబ్రహ్మణ్యం ప్రాణం లేచివచ్చింది. అతను మిగిలిన విషయాలన్నీ కట్టిపెట్టి, ముందు భూషణ్ ఇంతకాలమూ ఏంచేస్తున్నదీ, ఎట్లా గడుపుతున్నదీ విచారించాడు.

"అరే, బ్రదర్! నీ పేరు చెప్పగానే నౌకరీ దొరికింది. పొద్దున ఊళ్ళోదిగి సాయంకాలానికల్లా ఉద్యోగం సంపాదించాను. నీ పేరు చాలా మంచిపేరు. అయితే దాన్ని నీ అనుమతిలేకుండా కాస్త మార్చి మరీ అదృష్టంగల పేరుగా చేసేశాంలే! ఇప్పుడు నీ పేరేమిటో తెలుసా? బి. ఎస్. శాస్త్రి. నీకు న్యూమరాలజీలో నమ్మకం ఉందా?"

"నాకు లేదు" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"అయితే నువు చాలా పొరపాటు పడ్డావు! నేను బి. ఎస్. శాస్త్రి అని పెట్టుకోగానే నాకుకోరిన పిల్లపెళ్ళాంగా దొరికింది. ఇంకాపెళ్ళి కాలేదనుకో,అయినట్టే."

"నీకు న్యూమరాలజీలో అంత నమ్మకం ఉంటే నీ పేరు వెంటనే మార్చుకో! నీ పేరుపెట్టుకుని నేను జైలుకు పోవటానికి సిద్ధంగా ఉన్నాను" అన్నాడు సుబ్రహ్మణ్యం.

భూషణం విరగబడి నవ్వాడు.

"నిన్ను నిజంగా జైల్లో పెట్టాలిసిందే. యేదో గౌరవంగా బతుకుతున్న మా వ్యాపారాన్ని కాస్తా నడివీధి కెక్కించావు!... ఏం జరిగిం॥? సర్వభద్రం యేం చేశాడు? ఆయన దొంగతనం ఎట్లా పట్టావు? నువు రైల్లో చెప్పిన కబుర్లు చూసి పనిలో ఇంత గట్టివాడి వనుకోలేదు సుమా!"

సుబ్రహ్మణ్యం తన డ్రాయర్లోనించి తాను తయారుచేసిన స్టేట్‌మెంటు కాపీ తీసి భూషణాని కిచ్చాడు. భూషణం శ్రద్ధగా అంతా చదివి, "థాంక్స్, బడ్డీ. నీ ఉపకారం ఎప్పటికీ మరవలేను" అన్నాడు.

"ముందు మనం ప్లీడరుగారి దగ్గరికి పోవాలి. 'భూషణం యేడీ' అని ఆయన ఎగిరిపడుతున్నాడు" అన్నాడు సుబ్రహ్మణ్యం.



"అక్కడే కొంచెం పొరపాటుచేశావు భాయీ! ఈ భాగ్యానికి ప్లీడరుదగ్గిరికెందుకు పోయినావు! అయిందేదో అయింది. ఆ ముండాకొడుకును పోనీ. వాడు వదలటమే మనకు పదివేలు" అన్నాడు భూషణ్.

"అది మనచేతుల్లో ఉన్న పనే. కేసు మానుకున్నామని ఇప్పుడే ప్లీడరుగారికి టెలిఫోను చేద్దాం. ఇక ఇంతటితో మన ఇద్దరి ఎగ్రిమెంటూ అయిపోయిందనుకోవచ్చునా?"

"ఏ ఎగ్రిమెంటు?"

"ఇక నీ వ్యాపారం నువు చూసుకుని నన్నొదిలిపెట్టు, బాబూ. మూటలు మోసుకుని అయినా హాయిగా బతుకుతాను" అన్నాడు సుబ్రహ్మణ్యం.

భూషణం ఆశ్చర్యంగా, "ఏం? నీ ప్రాణం అంత విసగటానికి కారణం ఏమిటి?" అన్నాడు.

''నేను అనుభవించింది చాలు. నన్నింతటితో వొదిలిపెట్టు. నీకు పుణ్యం ఉంటుంది."

"నెల పూర్తి కాకమునుపే పారిపోయి ఓడిపోతావా?"

''పారిపోతాను. ఇది నీకు తట్టిన ఆలోచన. ఇందులో నేను గెలిచానని పించుకోవాలని నాకు లేదు.''

''ఇంకో ఇరవై రోజులపాటు భాగ్యవంతుడివిగా ఉండలేవా?''

"ఇంకొక్క రోజు కూడా ఉండలేను."

"నే నవతల నౌకరీ చేస్తున్నాను. అది వదిలిపెట్టి ఎట్లా రాగలను? నాకీ ఇరవై రోజులూ టైమ్ కావాలి."

"నీ సమస్యలు నీవే. నువు నీ విషయంలో ఆలోచించినట్టు నా విషయం నే నాలోచించుకోవద్దా?"

"తప్పకుండా! అయితే నీ విషయం కాస్త నన్నుకూడా ఆలోచించ నివ్వలేవా?''

"నా విషయం ఎవరూ ఆలోచించ నవసరంలేదు."

"నువ్విక్కణ్ణించి వెళ్ళిపోయి చూసుకునేది నౌకరీయేగా? నా ఆఫీసులోనే ఉండు బ్రదర్! నావల్ల నీకేం ద్రోహం జరిగింది?''

సుబ్రహ్మణ్యం మాట్లాడలేదు. భూషణం తనలో తను వితర్కించుకుంటున్న వాడల్లే, 'నీవిరక్తికి కారణం ఏమై ఉంటుంది? ఈ ఆఫీసై ఉండదు. ఆఫీసయితే ఇక్కడిపని యావత్తు ఇంత శ్రద్ధగా చేసిఉండవు. ఇంకేం కారణం అయి వుంటుందీ' అని ఆలోచించసాగాడు.

ఇంతలో అక్కడికి సుశీల వచ్చింది. ఆమెవంక రెండు క్షణాలపాటు ప్రశ్నార్థకంగా చూసి, 'సుస్!' అన్నాడు.


సుశీలకూడా ఆశ్చర్యంతో "భూషణ్?" అన్నది.

"నా వుత్తరం అందిందా?'' అన్నాడు భూషణ్.

''అందింది. కంగ్రాచులేషన్స్. ఏమంటున్నది మీ సూదంటురాయి?''

''ఏం చెప్పను? భావకవిత్వానికి తక్కువ మాట్లాడటంలేదు. నా మాటలు రంగుట! నా చూపుల వాసనట! నీ కేమన్నా అర్థమవుతున్నదా?"

"అదేమిటో నాకూ తెలుసు, భూషణ్! మీ-మీ సుబ్రహ్మణ్యంగారేరీ?"




"ఇదేం?...ఇప్పుడిక్కడే వుండెనే?" అన్నాడు భూషణ్ చుట్టూకలయచూసి.

"ఆయన నా కందకుండా పారిపోతున్నారు, భూషణ్," అన్నది సుశీల దీనంగా.

"అమ్మదొంగా!" అని భూషణ్ అకస్మాత్తుగా ఆగి సుశీలవంక ఆశ్చర్యంగా చూసి", చెప్పవూ! మీ కిద్దరికీ—"

"అవును, భూషణ్! ఆయన నా సూదంటురాయి."

"నిన్ను చూడగానే బయటికి జారుకున్నాడదేం సూదంటురాయి? ఎక్కడికి జారుకున్నాడు?"

"హోటలుకే వెళ్ళివుండాలి. త్వరగా పోదాం పద, భూషణ్."

"ఏమి టాతొందర? ఎక్కడికి పోతాడు?"

"ఏమో! నామీద కోపంచేత ఎక్కడికి పోయినా పోవచ్చు."

"నా సూట్లూ అవీ నా కివ్వకుండానే? పద, పోదాం!"

## 16

భూషణమూ, సుశీలా హోటలుకు చేరేటప్పటికి సుబ్రహ్మణ్యం అతి చురుకుగా సామానంతా సర్దేస్తున్నాడు. ఇద్దరూ రెండు నిమిషాలపాటు మౌనంగా నిలబడి మధ్యమధ్య ఒకరివంక ఒకరు చూస్తూ అతని సర్దుడు తిలకించారు.

సుబ్రహ్మణ్యం సర్దుడు పూర్తిచేసి భూషణంకేసి తిరిగి, "నా బట్టలు నా కిచ్చేస్తే నా ఒంటిమీద ఉన్న ఈ సూటుకూడా పెట్టెలో పెట్టేస్తాను" అన్నాడు.

భూషణం సుబ్రహ్మణ్యంకేసి తీవ్రంగాచూసి, వట్టి మాట్లాడుతూ, "అయితే నువు వెళ్ళిపోవటానికే తీర్మానించుకున్నా వన్నమాట !" అన్నాడు.


"క్షణాని కో ఆలోచన చెయ్యటానికి నేను లక్షాధికారిని కాను. నావంటి దరిద్రులు యేదో ఒకటి చప్పున తేల్చుకుని ఆ ప్రకారం నడుచుకోవలసిందే!" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"చూడబ్బాయి, మన బలాబలాలు పరీక్షించుకోటానికి ఒక ప్రయత్నం చేశాం. కాని ఇద్దరమూ గెలవటంవల్ల డ్రా అయింది. ఈసారి నిన్ను ఓడించటా నికి చేతు లుపయోగిస్తాను. చాతనయితే నన్ను ఓడించి అప్పుడు వెళ్ళిపో !" అన్నాడు భూషణం పిడికిళ్ల ప్రదర్శిస్తూ.

"లక్షాధికారివి. నీ స్వార్థంకోసం నువు పిస్తోళ్లుకూడా చూపించగలవు !" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"నీకేమన్నా తృప్తిగా ఉందేమోకాని, నీ అర్థికోపన్యాసాలు వింటున్నకొద్దీ నాకు వాంతి అయినంత పని అవుతున్నది. అసలుసంగతి—నిన్ను బలవంతాన ఉంచుతా నంటున్నది నా స్వార్థంకోసంకాదు. నా ఆఫీసులో పనిచెయ్యి, మాను. నేను నిర్బంధించను. ఉద్యోగందొరక్క రెండురోజులు డొక్క మాడితే నన్ను వెతుక్కుంటూ నువే వస్తావు. నువు చెయ్యనన్న తరవాత మా ఆఫీసులో ఉద్యోగం చెయ్యమని నేను బతిమాల్తానా ? అది కాదిప్పుడు. నా బాల్యస్నేహితు రాలైన ఈ సుశీలను మభ్యపెట్టి, నీ వలలో వేసుకుని పెళ్ళిచేసుకుంటానని మాట ఇచ్చి— ఇచ్చాడా, సుస్ ?—ఇప్పుడు దాని మొహమైనా చూడకుండా తప్పించుకు పోతుంటే నేను పక్కనే ఉండి చూస్తూ ఊరుకుంటా నను కున్నావా ?"

సుబ్రహ్మణ్యం నోరు తెరిచి తనవంకా, సుశీలవంకా ఆశ్చర్యంగా చూస్తుంటే భూషణానికి నవ్వాగలేదు. అతను సుశీలకేసి తిరిగి, "ఇతని రెండుచెంపలూ వాయించవలసిందానివి నిజంపడితే నువూ ! నీ కలివి కాకపోయినప్పుడు నన్ను కేకెయ్యి. నేనట్లా బయట నిలబడిఉంటాను" అంటూ భూషణం బయటికి పోసాగాడు.



సుబ్రహ్మణ్యం ఒక్కసారి చైతన్యంవచ్చి "ఉండు, భూషణం మాట!" అని కేక పెట్టాడు.

భూషణం వాకిలిదాకా వెళ్ళినవాడు ఆగి, తల అడ్డంగా తిప్పి, "లాభంలేదు బ్రదర్, సుశీల నిన్ను చెంపలు వాయిస్తుంటే నేను దాని చేతులుపట్టుకుని అడ్డగించలేను. పైపెచ్చు, నేను చూస్తుండగా చెంపలు వాయించుకోవటం, అదిమటుకు నీకేమంత గౌరవం?" అంటూ నవ్వి బయటికి వెళ్ళి పోయాడు.

సుశీలా, సుబ్రహ్మణ్యమూ ఒకరికొకరు ఒంటరిగా ఎదురైనారు. "నాకేమీ అర్థం కాలేదు. మీరిద్దరూ పెళ్ళిచేసుకోబోవటం లేదా?" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"అని మిమ్మల్నెవ రనుకోమన్నారూ?" అన్నది సుశీల.

"అతను నీ కేదో ఉత్తరం రాశాడే?"

''ఎవత్తెనో పెళ్ళిచేసుకోబోతున్నానని రాశాడు. మీకు ఉత్తరం చూపించినా చదివే యోగ్యద లేకపోతే అది నా తప్పా?"

సుబ్రహ్మణ్యం ఆలోచించాడు.

"ఆ ఉత్తరంచూసి నువు దిగులుపడ్డావు!"

"అది మీరు రాశారని కదా నే ననుకున్నది!"

"అవును. నేను భూషణాన్ననేగా నీ ఊహ? అటువంటప్పుడు నేను రాశా ననుకోవటమూ, భూషణం రాశాడనుకోవటమూ ఒకటేగా?"

''ఇన్ని సవాళ్లు చెయ్యకపోతే, 'నాకు నీమీద ఇష్టంలే' దని ఒక్క ముక్కలో చెప్పకూడదూ?" అన్నది మొహం పక్కకు తిప్పుకుని సుశీల.

''నాకు నీమీద ఇష్టంలేదా! ఎట్లా అనగలిగావా మాట?''

"ఎందుక్కా కూడదూ? భూషణ్ కోసం ఇష్టం లేకుండా అతని వ్యాపారం చూసిపెట్టలా? అట్లాగే అతని తరపున నామీద ఇష్టం వున్నట్టుకూడా నటించారు. అందుకనే మాటిమాటికీ నెల గడువు చెబుతూ వచ్చారు. నెలకాగానే నన్ను భూషణంమొహాన కొట్టి మీదారిన మీరు పోవచ్చుగదా అని! నేను రావుబహదూరుగా రబ్బాయిని పెళ్ళాడతా నన్నప్పుడుకూడా, నన్ను నెలరోజులూ ఆగమన్నదికూడా భూషణానికి భద్రంగా వప్పగించి తమరు తప్పుకుపోవటానికేగా? నాకూ అన్నీ తెలుస్తూనేఉన్నైలెండి.''

సుబ్రహ్మణ్యం దీనంగా, "నేను నీకోసం ఎంత బాధపడ్డానో, నీమీద నాకెంత అపేక్ష ఉందో ఎట్లా ఋజువుచెయ్యను?" అన్నాడు.

"సామాన్యంగా మగవాళ్లు తమ అపేక్ష ఆడవాళ్ళకెట్లా రుజువుచేస్తారో అట్లాగే...ఊరుకోండి! ఉండండి, భూషణ్ వస్తున్నట్టున్నాడు!" అన్నది సుశీల.

